

అచ్యుతానందన్ ప్రత్యేక సంచిక నేటి పత్రికతో అందుకోగలరు.
-ఎడిటర్

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 4 | విజయవాడ, సోమవారం 4 ఆగస్టు 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 4 August 2025 | Rs



'ఫలితం' నేటికి వాయిదా

- రసవత్తరంగా ఐదో టెస్టు
- విజయానికి నాలుగు వికెట్ల దూరంలో టీమిండియా

6

గ్రానైట్ క్వారీలో ఘోర ప్రమాదం

- ఆరుగురు వలస కార్మికులు దుర్మరణం
- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- గవర్నర్, సిఎం, మాజీ సిఎం దిగ్భ్రాంతి
- న్యాయ విచారణకు సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి– బల్లికురవ, బాపట్ల జిల్లా, అమరావతి బ్యూరో

బాపట్ల జిల్లా బల్లికురవ వద్ద ఉన్న సత్యకృష్ణ గ్రానైట్ క్వారీ పైభాగం నుంచి గ్రానైట్ రాళ్లు జారి కింద పడడంతో అక్కడ పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు వలస కార్మికులు దుర్మరణం చెందారు. ఎనిమిదిమంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్వారీ యాజమాన్యం ఎటువంటి రక్షణ చర్యలూ తీసుకోకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని తోటి కార్మికులు చెప్తున్నారు. రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల మిగతా 5లో




ప్రమాదం జరిగిన స్థలం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటమురళి

న్యాయ విచారణ : సిపిఎం డిమాండ్

ఈ ప్రమాదం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ప్రమాదంపై ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యంతోపాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందించాలని కోరారు. క్వారీ యాజమాన్యం సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా అధికారులు అంచనాకు వచ్చారని, ఈ నేపథ్యంలో కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. క్వారీ నిర్వహణకు ప్రభుత్వం అనుమతి లేదన్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.



విఎస్ అచ్యుతానందన్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు, చిత్రంలో వైవి, వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ, పి మధు

ప్రజల మనిషి

- కేరళలో అసాధారణ అభిమానం చూరగొన్న నేత
- ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన లాంటి వాళ్లు అవసరం
- విఎస్ అచ్యుతానందన్ సంస్మరణ సభలో బివి రాఘవులు


ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ప్రజా పోరాటాల్లో ముందుండి ప్రజల కోసం పోరాడిన పోరాట యోధుడు విఎస్ అచ్యుతానందన్ ప్రజల మనిషి అని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. సిపిఎం అగ్రనేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ సంస్మరణ సభ సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాఘవులు మాట్లాడారు. అచ్యుతానందన్ 99 ఏళ్లపాటు కమ్యూనిస్టు ఉద్యమంలో చురుగ్గా, క్రియాశీలకంగా, ఉద్యమకారునిగా, పోరాట యోధుడిగా జీవించారని తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణతో ప్రజలను అంటిపెట్టుకొని ఉన్నారని చెప్పారు. చిన్న అవకాశం దొరికినా, శక్తి కొంచెమే ఉన్నా ప్రజల కోసం పోరాటం చేశారని తెలిపారు. వర్గదృక్పథాన్ని ఆయన ఎప్పుడూ వదిలిపెట్టలేదని, కష్టజీవుల పక్షాన నిలబడ్డారని చెప్పారు. పోరాట యోధత్వం ఆయన జీవితంలో మిళితమైందన్నారు. కేరళలోనే అసాధారమైన అభిమానం చూరగొన్న వ్యక్తి అని కొనియాడారు. ప్రజల మనస్సు, హృదయాల్లో గాఢంగా నాటుకుపోయారని చెప్పారు. కమ్యూనిస్టు ఉద్యమంలో, వ్యక్తిగత జీవితంలో అత్యంత క్రమశిక్షణ ఆయన పాటించారని చెప్పారు. 17వ ఏటనే పీచు కార్మికుడిగా పని ప్రారంభించినప్పటి నుంచి ఆయన ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటూ పోరాటాల్లో ఉన్నారని చెప్పారు. ట్రావెన్‌కోర్ దివాన్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన పున్నప్ర – వాయలార్ పోరాటంలో ముఖ్యపాత్ర వహించారని తెలిపారు. కేరళలో ప్రజలు తమ బాధను చెప్పుకోకముందే శాసనసభలో విఎస్ వారి బాధను వ్యక్తపరిచేవారని తెలిపారు. సైద్ధాంతిక నిబద్ధతకు ఆయన పట్టుదలగా నిలబడేవారని పేర్కొన్నారు. విఎస్ ఏడో తరగతి వరకే చదువుకున్నా.. ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యమానికి అండదండగా నిలిచారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల్లో నిర్దిష్ట భాగం పంచాయతీలకు నేరుగా కేటాయించి ప్రజా అవసరాలకు ఖర్చు చేసుకునే విధానానికి విఎస్ శ్రీకారం చుట్టారని చెప్పారు. పరిపాలన సంస్కరణల కమిషన్‌కు ఛైర్మన్‌గా పనిచేసిన ఆయన ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని అరికట్టేందుకు అనేక ప్రతిపాదనలు చేశారని వివరించారు. నమ్మిన సిద్ధాంతాన్ని, అనుకున్న విషయాన్ని ఎప్పుడూ వదిలిపెట్టలేదన్నారు. ప్రతి అంశాన్ని ప్రజల ముందే ఉంచి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు వారిని అందులో భాగస్వాములను చేశారని వివరించారు. దేశంలో జాతీయోద్యమం వల్ల అభ్యుదయ, సెక్యులర్, ప్రజాస్వామిక, సమానత్వ భావాలు ప్రజల్లో నాటుకుపోయాయని తెలిపారు. కానీ 1990 తరువాత ఈ భావాలకు చిల్లుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మతతత్వం, నిరంకుశత్వ భావాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం తన పెత్తనం కోసం రాష్ట్రాలకు హక్కులు లేకుండా చేసేందుకు ఫెడరలిజానికి తూట్లు మిగతా 5లో

రాబోయే 3 రోజులు పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాబోయే మూడు రోజులు పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ తెలిపారు. వర్షాలతోపాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో సోమవారం అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మంగళవారం పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

'మానవత్వం కోసం మహాప్రదర్శన' పేరుతో సిడ్నీలో జరిగిన ర్యాలీలో లక్షలాదిగా పాల్గొన్న ప్రజానీకం..ఇన్‌సెట్‌లో ప్రసంగిస్తున్న అస్సాంజే

ఇజ్రాయిల్ దాష్టీకంపై సిడ్నీలో నిరసనాగ్రహం

సిడ్నీ : గాజాలో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో సాగిస్తున్న అమానవీయ దాడుల పట్ల ప్రపంచ వ్యాప్తంగా నిరసనాగ్రహం పెల్లుబుకుతోంది. సిడ్నీలో ఆదివారం జరిగిన నిరసన ప్రదర్శనకు లక్షలాది మంది తరలివచ్చారు. వికీలీక్స్ సంస్థ వ్యవస్థాపకులు జులియన్ అస్సాంజే తదితరులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.



రాష్ట్రపతితో ప్రధాని భేటీ

అనంతరం అమిత్ షా కూడా

న్యూఢిల్లీ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం సమావేశమయ్యారు. బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత అప్రజాస్వామికమని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తుండటంతో, మరోవైపు పహల్గాం ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్ అంశాలపైనా, భారత్, పాక్ మధ్య ఘర్షణలు ఆపింది తానేనంటూ అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేసిన ప్రకటనలపైనా, సుంకాల పెంపు పైనా, మణిపూర్‌లో అనిశ్చితిపైనా, ఇతర ప్రజాసమస్యలపై మోడీ సర్కార్ తీరును నిలదీయడంతో పార్లమెంటులో ప్రతిష్టంభన నెలకొన్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో మోడీ రాష్ట్రపతితో సమావేశం కావడం చర్చనీయాంశమైంది. రాష్ట్రపతితో ప్రధాని భేటీకి సంబంధించిన వివరాలు తెలియాల్సివుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారని రాష్ట్రపతి భవన్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి, రెండు చిత్రాలను కూడా జత చేసింది.

అమిత్ షా భేటీ

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఆదివారం సమావేశం అయ్యారు. ప్రధాని మోడీ సమావేశమైన కొద్ది సేపటి తర్వాత అమిత్ షా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ముర్ముతో భేటీ అయ్యారు. ప్రధానమంత్రి, కేంద్ర హోంశాఖ మంత్రి ఒకరి తర్వాత వెంటవెంటనే రాష్ట్రపతిని కలవడానికి కారణాలేమిటనేది తెలియరాలేదు.



రోదిస్తున్న బంధువులు (ఇన్‌సెట్‌లో హత్యకు గురైన) ములపర్తి మాధురి, పెద్ద కుమార్తె నిస్సి, చిన్న కుమార్తె ఫైజి (ఫైల్ ఫొటో)

సామర్లకోటలో కిరాతకం

తల్లి, ఇద్దరు పిల్లల దారుణ హత్య

ప్రజాశక్తి– సామర్లకోట

కాకినాడ జిల్లా సామర్లకోటలో తల్లి సహా ఇద్దరు ముక్కు పచ్చలారని ఆడ పిల్లలు దారుణ హత్యకు గురయ్యారు. ఆదివారం ఉదయం ఈ సంఘటన వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సామర్లకోటలోని సీతారామ కాలనీలో ములపర్తి ధనప్రసాద్, మాధురి (26) కుటుంబం ఉంటోంది. ధనప్రసాద్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఆదివారం తెల్లవారుజామున నైట్ డ్యూటీ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వచ్చిన ధనప్రసాద్ తన భార్యను ఎంత పిలిచినా బయటకు రాకపోవడంతో ఇంటి గోడదూకి చూడగా భార్య మాధురి, కుమార్తెలు నిస్సి (8), ఫైజీ (6) రక్తపుమడుగులో పడి మిగతా 2లో

సాగు దుర్భరం... జీవితం భారం

- పల్నాడు జిల్లాలో పెరుగుతున్న రైతులు, కౌలు రైతుల ఆత్మహత్యలు
- ఎక్స్‌గ్రేషియా అందించడంలోనూ సర్కార్ ఉదాశీనత

ప్రజాశక్తి– గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాలో రైతుల పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. గత కొన్నేళ్లుగా పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు, కౌలు రైతులు అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. 'ఏ పంట వేసినా ఏమి ప్రయోజనం' అన్నట్టుగా వారి పరిస్థితి రోజురోజుకూ అత్యంత దయనీయమైన స్థితిలోకి వెళ్తోంది. వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతులకు సేద్యం మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రత్యామ్నాయ ఉపాధి లభించక లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సేద్యం చేసి నష్టాలను మూటగట్టుకుని అప్పులు తీర్చలేక చివరికి జీవితాన్ని అర్ధాంతరంగా ముగిస్తున్నారు. ఏటా జిల్లాలో సగటున 30 మందికిపైగా రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కానీ, ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన వారికి కూడా పరిహారం చెల్లించడం లేదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మృతుని కుటుంబానికి రూ.7 లక్షలు పరిహారం ఇవ్వాల్సి ఉండగా, అందుకు సవాలక్ష నిబంధనలు చూపుతున్నారు. 2024లో పల్నాడు జిల్లాలో 16 మంది ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రభుత్వ రికార్డులు తెలియజేస్తున్నాయి. వారిలో నలుగురికి మాత్రమే పరిహారం అందింది. 2025లో ఇప్పటివరకు 18 మంది ఆత్మహత్యకు పాల్పడగా, ఇప్పటివరకు ఒక్కరికి కూడా పరిహారం అందలేదు. జిల్లాలో అధికంగా సాగయ్యే మిర్చి, పత్తి పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదు. గతేడాది పంట మార్పిడి కోసం పొగాకు సాగు చేసిన రైతులకు ఎన్నడూ రాని కష్టాలు వచ్చి పడ్డాయి. ఉత్పత్తి ఆశాజనకంగా వచ్చినా పొగాకు కొనేవారు లేక దాదాపు నాలుగు నెలలపాటు నిద్రలేని రాత్రులు గడిపారు. ఇప్పటికీ ఉత్పత్తి అయిన పొగాకు, బర్లీ పొగాకులో 50 శాతం రైతుల వద్దే ఉంది. 20 క్వింటాలుకు మించి కొనుగోలు చేయబోమని ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. నాలుగు నెలలుగా ఎదురు చూసిన రైతులు ఆర్థిక అవసరాల కోసం దళారులకే ఎక్కువగా విక్రయించారు. ఈ ఏడాది మిర్చి ధరలు కూడా గణనీయంగా పడిపోయాయి. గతేడాది మిర్చి గరిష్టంగా రూ.18 వేలు రాగా, ఈ ఏడాది గరిష్టంగా రూ.12 వేలు మాత్రమే వచ్చింది. పత్తి విక్రయాల్లో కూడా రైతులు అనేక ఇబ్బందులు చవిచూశారు. ఈ ఏడాది అపరాల ధరలు భారీగా తగ్గాయి. ఏ పంట సాగు చేసినా రైతులకు గిట్టుబాటు ధర లభించలేదు. ఎకరాకు కౌలు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరగడంతో పెట్టుబడి పెరిగింది. ఎకరాకు మిర్చికి రూ.2 లక్షలు, పత్తికి రూ.50 వేలు, పొగాకుకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. పంట చేతికి వచ్చిన సమయంలో ధరలు బాగా తగ్గడంతో నష్టాలను తట్టుకోలేక, అప్పులు తీర్చలేక ఆర్థిక బాధలతో రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నా ప్రభుత్వం నుంచి పరిహారం రావడం లేదు. రైతుల ఆత్మహత్యలను నిర్ధారించడానికి మండల స్థాయి కమిటీ, జిల్లా స్థాయికి సిఫార్సు చేయాల్సి ఉంది. మండల స్థాయిలో తహశీల్దార్, వ్యవసాయ శాఖ అధికారి, సబ్ ఇన్‌స్పెక్టర్ కలిసి విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సి ఉండగా, చాలా కేసుల్లో రైతుల బలవన్మరణాలకు వేరే కారణాలు చూపి చేతులు దులుపుకుంటున్నారు.




ఆత్మహత్యకు పాల్పడిన రైతులు ఆదినారాయణ, గోపాలరావు (ఫైల్ ఫొటో)

అత్యాచార బాధితపై కాల్పులు

- బెయిల్‌పై బయటకు రాగానే దుండగుడి ఘాతుకం

ఢిల్లీ : అత్యాచారం కేసులో జైలుపాలైన ఒక దుండగుడు బెయిల్‌పై బయటకు వచ్చి తన స్నేహితుడితో కలిసి బాధితురాలిపై తుపాకీతో కాల్పులకు పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలో ఓ సెలూన్ హెడ్ మేనేజర్‌గా పని చేస్తున్న ఓ మహిళ తనపై అత్యాచారం చేశాడంటూ అబుజైర్ సఫీపై గతేడాది పోలీస్ కేసు పెట్టింది. అప్పట్లో అరెస్టయిన సఫీ ఇటీవల కోర్టు బెయిల్ ఇవ్వడంతో బయటకు వచ్చాడు. మరో స్నేహితుడు అమన్ శుక్లాతో కలిసి ముందస్తు ప్రణాళిక ప్రకారం బుధవారం రాత్రి ఆటోలో వెళుతున్న మహిళను బైక్‌పై వెంబడించి, కాల్పులు జరిపి పారిపోయారు. మహిళ ఛాతీలోకి బుల్లెట్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని ఆటో డ్రైవర్ ఆసుపత్రిలో చేర్పించాడు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుతో అబుజైర్ సఫీ, అమన్ శుక్లాను పోలీసులు అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

కౌలు రైతులకు రూ.20 వేలు ఒకే విడతలో చెల్లించాలి

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం నిధులు ఒకే విడత కింద రూ.20 వేలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి రైతుకూ అన్నదాతా సుఖీభవ పథకం వర్తింపజేయాలన్నారు. భూమి లేని కౌలు రైతులందరికీ ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో ముందస్తుగా వారందరినీ గుర్తించి కార్డులు మంజూరు చేయాలన్నారు. 10 లక్షల మంది కౌలు రైతులకు కార్డులివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. ఇప్పటి వరకు 3 లక్షల మందికి కూడా ఇవ్వలేదన్నారు. 2019 పంట సాగు హక్కు చట్టంలో మార్పులు చేసి భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరినీ గుర్తించి ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్భాటం చేసిన టిడిపి ప్రభుత్వం.. నూతన చట్టం మాత్రం అమలు చేయలేదన్నారు. భూ యజమానికి ఉన్న భూమితో సంబంధం లేకుండా సాగులోని కౌలు రైతు ఒక్కరికే పెట్టుబడి సాయం ఇస్తామని నిర్ణయించడం అన్యాయమన్నారు. భూ యజమాని వద్ద ఎంత మంది సాగు చేస్తున్నారో అందరికీ పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో 53.58 లక్షల మందికి పెట్టుబడి సాయం ఇవ్వగా, ప్రస్తుతం 46.68 లక్షల మందికి మాత్రమే ఇచ్చారన్నారు. అందులో 6.72 లక్షల మందిని అనర్హులుగా ప్రకటించారన్నారు.

విశాఖలోని భూఅక్రమాలపై విచారణ జరపాలి : అయ్యన్న

ప్రజాశక్తి - నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా)

విశాఖలోని భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రాష్ట్ర రెవెన్యూ అధికారులను ఆదివారం ఆదేశించారు. విశాఖలో జరిగిన భూ అక్రమాలపై జివిఎంసిలోని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఇటీవల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. విశాఖ రూరల్ మండలంలోని ఎండాడ సర్వే నెంబర్ 14-1లో మాజీ సైనికులకు ఇచ్చిన 5.10 ఎకరాల భూములకు అనుమతి పత్రాల జారీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని మూర్తి యాదవ్ ఆరోపించారు. ఆ సమయంలో అయ్యన్న పేరును ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై స్పీకర్ స్పందిస్తూ ఆర్థిక రాజధానిగా, ఐటి హబ్‌గా ఉన్న విశాఖలో భూముల అన్యాక్రాంతాన్ని సహించేది లేదన్నారు. ఎండాడలోని భుములపై దర్యాప్తు చేయాలన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం మరలా మూర్తియాదవ్ ఓ ప్రకటన విడుదల చేశారు. సభాపతి అయ్యన్న పాత్రుడు ప్రతిష్టకు భంగం కలిగించేలా తాను మాట్లాడలేదని తెలిపారు. అయ్యన్నకు అన్యాయం చేసిన వైసిపికి చెందిన వ్యక్తులకే టిడిపి కూటమి ప్రభుత్వంలో మాజీ సైనిక ఉద్యోగి భూమికి ఎన్‌ఒసి ఇచ్చారని ఆరోపించారు.

ఉచిత బస్సు ప్రయాణంపై రేపు ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలతో సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15 నుంచి ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనున్న నేపథ్యంలో ఈ నెల 5న విజయవాడ ఆర్‌టిసి భవన్‌లో ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు నేతృత్వంలో ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ మేరకు ఆర్‌టిసి అధికారులు ఆదివారం ఉద్యోగ సంఘాలకు సమాచారాన్ని అందించారు. ఈ సమావేశానికి ఒక్కో సంఘం నుంచి ఇద్దరు సభ్యులు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉచిత బస్సు ప్రయాణం, డ్రైవర్లు, కండక్టర్లు, టిమ్ ఆపరేటింగ్, టిమ్ ఛార్జింగ్, బస్సుల్లో సిట్టింగ్, బస్సుల నిర్వహణ, ప్రయాణికులతో ఎలా వ్యవహరించాలి? సిబ్బంది కొరతను ఎలా అధిగమించాలనే అంశాలపై ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలతో ఆర్‌టిసి యాజమాన్యం చర్చించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆర్‌టిసి పాలకవర్గం, ఉన్నతాధికారులు జిల్లాలు, జోన్‌లు వారీ పర్యటించారు. పర్యటనల నేపథ్యంలో ఆయా జిల్లాల నుంచి సేకరించిన సమాచారంతో పాటు ఆర్‌టిసి ఉద్యోగ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ముందుకు వెళ్లనున్నట్లు సమాచారం.

సామర్లకోటలో కిరాతకం

(మొదటిపేజీ తరువాయి)

మరణించి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌పి బిందుమాధవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ ఇంటి వెనక మార్గం నుంచి వెనుక వీధిలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఆగింది. నిస్సి నాలుగో తరగతి, ప్రైజీ మూడవ తరగతి చదువుతున్నారు. ఈ హత్యలపై వివరాలు సేకరిస్తున్నామని, కారణాలను విశ్లేషిస్తున్నామని ఎస్‌పి తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హత్యకు గురైన వారి కుటుంబసభ్యుల రోదనలు చూపరులను కన్నీరు పెట్టించాయి. కాగా, ధనుప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

విద్యార్థుల దీక్షలు భగ్నం

- అర్ధరాత్రి పోలీసుల దౌర్జన్యం



నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి- పార్వతీపురం మన్యం జిల్లా

పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులు నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్షా శిబిరంపై శనివారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. దీక్షా శిబిరంలో నిద్రిస్తున్న వారిని దీక్షలకు భగ్నం చేశారు. పలువురు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. పార్వపురం మన్యం జిల్లా పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, పాలకొండలో పిజి సెంటర్లు ఏర్పాటు చేయాలని, డిగ్రీ అడ్మిషన్లు సకాలంలో పూర్తి చేయాలని, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎఎన్‌ఎంలను నియమించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ఈ నెల ఒకటి నుంచి కలెక్టరేట్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. అధికారులు సమస్యలను పరిష్కరించకపోగా, రెండో రోజైన శనివారం అర్ధరాత్రి సమయంలో విద్యార్థుల దీక్షా శిబిరంపై పోలీసులు దౌర్జన్యం చేశారు. తొలుత కుర్చీలు, మైకు, లైట్లు, టెంట్లు తదితర సామగ్రిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయినా, పట్టుసడలకుండా విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా పోలీసులకు, వారికి మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్, జిల్లా కోశాధికారి కె.డేవిడ్, సహాయ కార్యదర్శులు ఎ.గంగారం, సిహెచ్.సింహాచలం, ఎం.సంజీవి, జి సురేష్, కృష్ణను బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడిచిపెట్టారు.

కరేడు రైతు, కూలీలకు అండగా రాష్ట్ర వ్యాప్త పోరాటం

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పరిశ్రమలు అభివృద్ధి పేరుతో పంట పొలాలను బలవంతంగా లాక్కోవద్దని, కరేడులో బలవంతపు భూ సేకరణలో ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే రైతులు, కూలీలు, దళితులు, మత్స్యకారులకు అండగా రాష్ట్ర వ్యాప్త పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి పేర్కొంది. విజయవాడలోని కెఎల్ రావు భవన్‌లో రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతు సంఘాల నేతలు మాట్లాడుతూ.. కరేడులో గత నెల రోజులుగా ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా గ్రామస్తులు, రైతులు, రైతు కూలీలు, మత్స్యకారులు, గిరిజనులు, దళితులు వీరోచితంగా పోరాటం చేస్తున్నారన్నారు. పోరాటాన్ని జీర్ణించుకోలేని ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు అసత్య ప్రచారం చేస్తోందన్నారు. ప్రతి ఘటన చేస్తున్న ఉద్యమకారులపై నిర్బంధం ప్రయోగిస్తుండటాన్ని రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు తప్పుబట్టారు. కరేడులో రైతులపై ప్రభుత్వం నిర్బంధాన్ని అమలు చేస్తోందని, సెక్షన్ 30 అమల్లోకి తెచ్చి ఉద్యమాన్ని అణచడానికి చూస్తోందని వారు విమర్శించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వై కేశవరావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు, కౌలు రైతు సంఘం నాయకులు హరిబాబు, జమలయ్య సామాజిక వేత్త వసుంధర, రైతుకూలీ సంఘం జాతీయ కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ నాయకులు హరినాథ్, కరేడు జెఎసి నాయకులు మిరియం శ్రీనివాసులు, బత్తుల వెంకట రమణారెడ్డి, బి వెంకారెడ్డి, ఎమ్మెల్సీ రఘురామ్‌రాజు, దళిత నేత కొరివి వినయ్‌కుమార్, ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టరుగా పనిచేసిన మాజీ ఐఎఎస్ అధికారి జిఎస్‌ఆర్‌కె ఆర్ విజయ్‌కుమార్, సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జివిబి కుమార్, ఉలవపాడు మండల నాయకులు కత్తి సుజాత, వీసం విజయ్, ఎం అంకమరావు, కరేడు గ్రామ నాయకులు అజిత్‌రెడ్డి, మాలకొండారెడ్డి, పలు ప్రాంతాలకు చెందిన ప్రజా సంఘాల నేతలు హాజరయ్యారు.



నెల్లూరులోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా

విద్యుత్ భారాలు వేయొద్దు

- స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయొద్దని, అదనపు వసూళ్లు ఆపాలని, స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయాలని, మీటర్ల బిగించొద్దని, పెట్టిన మీటర్లు తొలగించాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖలోని మధురవాడ రైతు బజారు వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. జివిఎంసి 86, 75వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరిలోవలో పాదయాత్ర చేపట్టారు. అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం రామదాసు గారి వీధిలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు.ఏలూరు జిల్లా టి.నరసాపురం, కుక్కునూరు మండలంలోని చీరవల్లి, కలిదిండిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఆగిరిపల్లిలో అవగాహన కార్యక్రమం చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రూరల్ మండలం తోకతిప్ప గ్రామంలో ఆందోళన చేశారు. నెల్లూరు కోటమిట్ట ప్రాంతంలోని చేపల మార్కెట్ సెంటర్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ప్రజల నెత్తిన గుదిబండగా మారే స్మార్ట్ మీటర్ల బిగింపు చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో ఇంటింటా ప్రచారం చేశారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

- ఎపి కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బెల్ట్ షాపులు తొలగించి, కష్టాల్లో ఉన్న కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడలోని ఎంబివికెలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఊరూరా బెల్ట్ షాపులు పెట్టించి కల్లు అమ్మకాలు లేకుండా చేసిందన్నారు. మరోవైపు యానాం, గోవా తదితర ప్రాంతాల నుంచి అక్రమ మద్యం వరదలా వస్తున్నా.. ఎక్సైజ్‌శాఖ చోద్యం చూస్తుందన్నారు. గీత కార్మికుల ఉపాధి, సంక్షేమం, వృత్తి, ఆధునీకరణల గురించి ప్రభుత్వం పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా, గీత వృత్తిని, కల్లుగీత కుటుంబాలను ఆదుకుంటుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వడమే కాకుండా నీరా కేఫ్‌లు పెట్టించడం వృత్తిలో ప్రమాదాలు తగ్గించేందుకు సేఫ్టీ మోకులు ఇస్తుందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మాత్రం పొమ్మనకుండా పొగ పెడుతుందన్నారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులు తొలగించి ఉపాధిని కాపాడుకునేందుకు పోరాటమే మార్గమని, గీత కార్మికులు ఇందుకు సన్నద్ధం కావాలని రాష్ట్ర కమిటీ పిలుపునిస్తుందని తెలిపారు. వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఎం భాస్కరయ్య మాట్లాడుతూ.. చేతి వృత్తిదారులకు ఉపయోగం లేని 56 కార్పొరేషన్లు ఎందుకని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలుపై వృత్తిదారులను చైతన్య పరిచి ఐక్య ఉద్యమాలకు సిద్ధం అవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశానికి వాకా రామచంద్రరావు అధ్యక్షత వహించారు. సంఘం నాయకులు దేవుడు, మునిస్వామి, చంటి, అప్పారావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సోమేశ్వరరావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



సూసైడ్ నోట్ ఉరివేసుకుని మృతిచెందిన మస్తానయ్య

ఫైనాన్స్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం (నెల్లూరు జిల్లా)

ఫైనాన్స్ సంస్థ ప్రతినిధుల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టుబడిపాలెంలోని దళితవాడకు చెందిన చిన్న మస్తానయ్య (72) తన పిల్లల చదువు కోసం ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ సంస్థలో తన ఇంటిని తనఖా పెట్టి రూ.7 లక్షలు రుణం తీసుకున్నారు. దాదాపు రెండేళ్లపాటు నెలకు రూ.14 వేల చొప్పున వాయిదాలు చెల్లిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా జూన్, జులై మాసాలకు వాయిదా సరిగా చెల్లించలేకపోయారు. దీంతో, ఆ ఫైనాన్స్ సంస్థ సిబ్బంది మస్తానయ్య ఇంటికి వచ్చి మానసికంగా వేధించారు. ఇల్లు తనఖాలో ఉందని, రూ.8 లక్షలకు అమ్మబడుతుం దని ఇంటి గోడలపై సిరాతో రాసి వెళ్లారు. దీన్ని అవమానంగా భావించిన చిన్న మస్తానయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటి ఆవరణంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఫైనాన్స్ సంస్థ వేధింపులు తాళలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోటు రాసి బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్న మస్తానయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అబార్షన్ వికటించి గర్భిణి మృతి

- ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు
- ఆస్పత్రిపై దాడి

ప్రజాశక్తి - అనంతపురం

అబార్షన్ వికటించి గర్భిణి మృతి చెందిన సంఘటన అనంతపురంలోని రామచంద్రనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుక్కరాయసముద్రం మండలం చెదల్ల గ్రామానికి చెందిన మల్లికార్జున, ఆయన భార్య ఐదు నెలల గర్భిణి రాధిక (32) అబార్షన్ నిమిత్తం శ్రీ కృప మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రమణ నాయక్‌ను శుక్రవారం సంప్రదించారు. ఇప్పటికే ఆ దంపతులకు ఐదేళ్ల చిన్నారి, రెండేళ్ల బాలుడు ఉన్నారు. మూడవ సంతానం వద్దనుకొని అబార్షన్ కోసం వైద్యులను ఆశ్రయించారు.

ఎలాటి అనుమతులు లేకుండా శ్రీ కృపా ఆస్పత్రి వైద్యులు రమణ నాయక్ అబార్షన్ చేస్తానని, సిద్ధం కావాలని చెప్పడంతో ఆ దంపతులు ఆదివారం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆపరేషన్ థియేటర్లో అబార్షన్ చేస్తున్న సమయంలో వైద్యం వికటించి రాధిక అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో ఆమె బంధువులు ఆస్పత్రి బయట ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే రాధిక మృతి చెందిందంటూ ఆస్పత్రిపై దాడి చేశారు. ఆస్పత్రికి అనుమతులు లేకుండా వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు పట్ల తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ఆస్పత్రికి అనుమతులు లేనిది వాస్తవం. చట్టపరంగా అనుమతులు లేకుండా చికిత్స చేయకూడదు. ఆపరేషన్ చేయడంతో గర్భిణి మృతి చెందిందని ఫిర్యాదు అందింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.

- అనుపమ జేమ్స్, ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ

ప్రయత్నం చేశాం

అబార్షన్ కోసం తమను ఆశ్రయించారు. అయితే, అప్పటికే పలుచోట్ల ఇతర మందులు వాడడం వల్ల అంతర్గతంగా పలు సమస్యలు చోటుచేసుకున్నాయి. అబార్షన్ చేసే సమయంలో రక్తస్రావం నియంత్రించేందుకు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది.

- డాక్టర్ రమణ నాయక్, శ్రీకృప ఆస్పత్రి వైద్యులు

262.58 ఎంయులకు విద్యుత్ డిమాండ్

- రెండో అత్యధికం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మారిన వాతావరణ పరిస్థితుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. వాతావరణం వేడి, ఉక్కపోతగా ఉండటం వల్ల రోజువారీ డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. శనివారం రాష్ట్రంలో 262.58 మిలియన్ యూనిట్ల (ఎంయు)కు చేరుకుంది. ఇది రాష్ట్ర విద్యుత్ వినియోగంలో అత్యధిక డిమాండ్‌లో రెండోస్థానం. 2023 వేసవిలో 263.2 ఎంయుల డిమాండ్ నమోదైంది. ఆ తరువాత డిమాండ్ శనివారం 262.58 ఎంయులు నమోదైంది. రోజువారీ గరిష్ట డిమాండ్ 12,860 మెగావాట్లు (మెవా)గా నమోదైంది. సుమారు 20 ఎంయుల విద్యుత్‌ను డిస్కంలు విద్యుత్ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నాయి. ఒక్కో యూనిట్‌ను గరిష్టంగా రూ.10 చొప్పున కొంటున్నాయి. సరాసరి ఈ ఖర్చు రూ.5 నుంచి రూ.6 వరకు పడుతోంది.

హైకోర్టు క్వాష్ చేసిన 15 ఎసిబి కేసులపై ప్రభుత్వం అప్పీల్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేవలం సాంకేతిక కారణాలు చూపి ఈ నెల ఒకటిన హైకోర్టు 15 అవినీతి కేసులను రద్దు చేయడం విస్మయం కలిగించిందని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ కేసుల్లో ఒక్కొక్కరు, ఒక్కో రకమైన అవినీతిపరులని, రూ.100 కోట్లకుపైగా సమాజాన్ని ప్రభుత్వ ఉద్యోగుల ముసుగులో దోచుకున్న నేరస్తులని వ్యాఖ్యానాలున్నాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ 15 కేసుల్లో ఆ తీవ్రమైన అవినీతిపరులను నాటి ఎపి ఎసిబి పట్టుకొని చట్టం ముందు దోషులుగా నిలబెట్టి, సమాజం ముందు వారి నేరాలను ఎండగట్టినా ఇలా రద్దు కావడం వల్ల అవినీతికి పట్టపగ్గాలు లేకుండా పోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. సిఆర్‌పిసి సెక్షన్-2 (ఎస్) ప్రకారం ఏదైనా కార్యాలయం పోలీస్ స్టేషన్‌గా పరిగణించబడాలంటే ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఉత్తర్వులు జారీ చేయని కారణంగా ఎసిబి (సిఐయు) యూనిట్ నమోదు చేసిన కేసులన్నీ ఉన్నపలంగా రద్దు అయిపోయాయన్నారు. 2014లో రాష్ట్ర విభజన తరువాత జిఓఎంఎస్ నెంబరు 137 ద్వారా 2022 సెప్టెంబరు 14న ఎపి ఎసిబి సిఐయు యూనిట్ నోటిఫై చేసిందన్నారు. దీంతో 2014 నుంచి 2022లో జిఓ విడుదలకు ముందు నమోదు చేసిన సెంట్రల్ యూనిట్ కేసులన్నీ ఒక్క హైకోర్టు క్వాష్‌తో రద్దయిపోయాయని తెలిపారు. స్పెషల్ కోర్టులు - నోటిఫై కాని పోలీసు స్టేషన్ నుంచి వచ్చిన కేసులను స్వీకరించడాన్ని ఎపి హైకోర్టు తప్పుపట్టిందన్నారు. ఎసిబి సెంట్రల్ యూనిట్ కేసులన్నీ ప్రారంభం నుంచే చెల్లనివిగా హైకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు, పెద్ద పత్రికలు నోరుమెదపకపోవడంతో మున్ముందు రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీల్‌కు వెళుతుందా? లేదా అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కాబట్టి రాష్ట్రప్రభుత్వం ఇకనైనా మేల్కొని సుప్రీంకోర్టుకు వెళ్లి నెట్‌వర్క్ కేసులు తిరిగి విచారణ, అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకునేలా నిర్ణయం తీసుకోవాలని సిపిఎం ఈ సందర్భంగా డిమాండ్ చేస్తోందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు

యాప్‌ల వల్ల పిల్లలకు అక్షరాలు వస్తాయా?

- గిన్నిస్ రికార్డుల కోసం ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం తగునా?
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రకరకాల యాప్‌ల వల్ల పిల్లలకు అక్షరాలు, గణితం వస్తుందా అని ప్రభుత్వాన్ని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. గిన్నిస్ బుక్ రికార్డుల కోసం పాఠశాల తెరిసిన తర్వాత యోగ పేరుతో, పిటిఎం పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి రకరకాల ఫొటోలు అప్లోడ్ చేయించడం పట్ల తీవ్ర నిరసన, వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నామన్నారు. తిరుపతి జిల్లాలో యుటిఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రకరకాల యాప్‌లు పిల్లల బోధనకు ఆటంకంగా ఉన్నాయని తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారుల వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యారంగ సంస్కరణల వల్ల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సి ఉంటుంది. కానీ ఆచరణలో పాఠశాలలు కుదించడానికి, ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించడానికి తద్వారా ప్రభుత్వ పాఠశాల నుంచి పిల్లలు ప్రయివేటు పాఠశాలలకు వెళ్లడానికి ఉపయోగపడిందని తెలిపారు. ప్లస్ 2 పాఠశాలలను ఇప్పటివరకు అభివృద్ధిపరిచి పిల్లలను చేర్చడంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయులను పక్కనపెట్టి ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌కి ప్లస్ టు పాఠశాలలను కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మండల విద్యాశాఖ అధికారుల అదనపు బాధ్యతల కేటాయింపులో కోర్టు సూచనలను పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఉమ్మడి సర్వీసులు సాధనకు అందరూ ఐక్యతతో పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రభుత్వం స్పందించుకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు సి సురేష్, ఎ పద్మజ, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్ నాగరాజు పాల్గొన్నారు.

రేపు సర్పంచుల 'చలో విజయవాడ'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల, సర్పంచుల ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న 'చలో విజయవాడ' కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు సర్పంచుల సంఘం తెలిపింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు హాజరుకావాలని సంఘం నేతలు టి కృష్ణమోహన్, జయరామ్‌రెడ్డి, శ్రీరామ్మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీల సర్పంచుల సమస్యలపై ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను గత ఏడు నెలలుగా విడుదల చేయడం లేదన్నారు. దీంతో అనేక గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో వేసవిలో ఇబ్బందులు పడినట్లు పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణ, బ్లీచింగ్, పారిశుధ్య కార్మికులకు జీతాలు తదితర సమస్యల పరిష్కారానికి నిధుల కొరతను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. తక్షణమే గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు జమ చేయడం, సర్పంచులకు గౌరవ వేతనం పెంచడం, ఉపాధి హామీ పథకంలో పనులను గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నిర్వహించాలని, పంచాయతీలకు రావాల్సిన రిజిస్ట్రేషన్ సెస్, సర్ ఛార్జీలను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు. సర్పంచులతో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సమావేశాన్ని ఏర్పాటు చేసి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కొడాలి నానిపై మరో కేసు నమోదు

ప్రజాశక్తి - గుడివాడ (కృష్ణా జిల్లా)

వైసిపి నేత, మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)పై మరో కేసు నమోదైంది. కొడాలి నాని అధికారంలో ఉండగా చంద్రబాబునాయుడు, లోకేష్‌లను సామాజిక మాధ్యమాల్లో దుర్భాషలాడారని, కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ విశాఖ వాసి అంజనాప్రియ 2024లో విశాఖపట్నం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కొడాలి నానిపై యుబైఎస్ 353(2), 352, 351(4), 196(1), బిఎన్‌ఎస్ 467, ఐటి యాక్ట్ కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం కృష్ణా జిల్లా గుడివాడలోని కొడాలి నాని ఇంటికి వెళ్లిన పోలీసులు విచారణకు రావాలని 41 సిఆర్‌పిసి నోటీసులు అందజేశారు.

మఠాలకు నోటీసులు హిందూ ధర్మాన్ని అవహేళన చేయడమే : భూమన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

టిటిడి మఠాలకు నోటీసులు ఇవ్వడమంటే హిందూ ధర్మాన్ని అవహేళన చేయడమేనని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతిలోని తన నివాసంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించే తిరుమల కొండపై ఉన్న మఠాలకు నోటీసులు ఇవ్వడమంటే మఠాధిపతులను అవమానించడమేనని తెలిపారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతోపాటు నోటీసుల్లో మారణాయుధాలు, నిషేధిత వస్తువులు, పేలుడు పదార్థాలు రాకుండా తనిఖీ చేయాలని చెప్పడం చూస్తుంటే, మఠాల నిర్వహణ మీద అనుమానాలు వ్యక్తం చేయడమే అవుతుందని తెలిపారు. హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తామని ప్రచారం చేసుకున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తూ దాదాపు 32 మఠాల వరకు కొండ మీద కొనసాగుతుండగా, వాటికి టిడిపి కూటమి ప్రభుత్వం నోటీసులు జారీ చేసిందని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న పీఠాధిపతులను అవమానించడమేనని అన్నారు. తిరుమల కొండపై నడుస్తున్న గెస్ట్ హౌస్‌లు, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పిఎసిలకు ఇలాంటి నోటీసులు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. మఠాధిపతులు మేల్కొవాలని, మఠాలపై జరుగుతున్న దాడిని ఖండించాలని కోరారు.

టెస్లాపై రూ.2,100 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ : ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల తయారీ కంపెనీ టెస్లాకు భారీ జరిమానా పడింది. టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థ తప్పిదమే 2019 నాటి రోడ్డు ప్రమాదానికి కారణమని ఫ్లోరిడా కోర్టు నిర్ధారించింది. దీంతో బాధితులకు 242 మిలియన్ డాలర్ల (సుమారు రూ.2,100 కోట్లు) పరిహారం చెల్లించాలని కంపెనీని ఆదేశించింది. నాటి ప్రమాదంలో ఒక యువతి మరణించగా, మరో వ్యక్తి గాయపడ్డారు. 2019లో ఫ్లోరిడాలోని ఒక ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించగా సుదీర్ఘ విచారణ అనంతరం తాజా తీర్పు వెలువడింది. బాధిత కుటుంబాలకు 329 మిలియన్ డాలర్ల నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కారులోని ఆటోపైలట్ వ్యవస్థ తప్పిదం కూడా ప్రమాదానికి కారణమని గుర్తించిన కోర్టు పరిహారంలో 242 మి.డాలర్లు టెస్లా కంపెనీ చెల్లించాలని, మిగిలిన పరిహారం సదరు వాహన డ్రైవర్ అందించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు టెస్లా తెలిపింది.

పేదలకు భూ పంపిణీ చేస్తేనే నిజమైన అభివృద్ధి

- సెప్టెంబర్ 8, 9, 10న కడపలో వ్యకాస జాతీయ కౌన్సిల్ సమావేశాలు : వి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

భూమిలేని పేదలకు ప్రభుత్వం భూ పంపిణీ చేస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆల్ ఇండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జాతీయ కౌన్సిల్ సమావేశాలు సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో కడపలో నిర్వహించనున్నట్లు చెప్పారు. కడప జిల్లా యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో వ్యకాస ఆధ్వర్యంలో 'భూ పంపిణీ-సాగునీరు-పారిశ్రామిక అభివృద్ధి' అనే అంశంపై జిల్లా అధ్యక్షులు శివకుమార్ అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఐదు శాతం (ఆరు లక్షల ఎకరాలు) భూమి భూ స్వాముల వద్ద బందీగా ఉందని పేర్కొన్నారు. ఐదు లక్షల కుటుంబాల వద్ద ఒక ఎకరం భూమి కూడా లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదాని, అంబానీలకు రూ.20 లక్షల కోట్ల ఆదాయం పెంచాలని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులకు రూ. 200 కూడా పెంచలేదని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రోజువారీ కూలి వెయ్యి రూపాయలు చేసిందని గుర్తు చేశారు.

రాష్ట్రంలో 12 ఏళ్లుగా భూ పంపిణీ చేయలేదని, ప్రభుత్వం భూ పంపిణీ చేసేవరకు పోరాడాలని కోరారు. జిల్లాలో ఏడు మండలాలలో, 20 గ్రామాల్లో ఎర్రజెండాలు పాతి.. భూ పోరాటాలు ప్రారంభించాలని చెప్పారు. కౌన్సిల్ సమావేశాలకు దేశవ్యాప్తంగా 200 మంది జాతీయ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. కేరళ, బెంగాల్, త్రిపుర, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు సైతం హాజరవుతారని చెప్పారు. 'ఉంటే ప్రభుత్వ భూముల్లో ఉంటాం.. లేకుంటే జైల్లో ఉంటాం' అనే నినాదంతో వ్యవసాయ కార్మికులందరూ గ్రామ, గ్రామాన దండుగా ఐక్య భూ పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు డి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు జి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి అన్వేష్, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐఎం సుబ్బమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం చిన్న, వి శివకుమార్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి జకరయ్య, కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ, మహిళ, యువజన, విద్యార్థి, సంఘాల నాయకులు ప్రసంగించారు.

మద్యం కుంభకోణంలో చట్టం తన పని తాను చేస్తోంది

- రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత


అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చిన హోంమంత్రి అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వైసిపి ప్రభుత్వంలో జరిగిన మద్యంపై కుంభకోణంపై కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఆమె ఆదివారం పర్యటించారు. తొలుత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత విలేకరులతో మాట్లాడుతూ.. మద్యం కుంభకోణంపై సిట్ విచారణ వేగంగా జరుగుతోందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ఈగల్ టీమ్ వెంటపడుతూనే పనిచేస్తోందని తెలిపారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఆలయాలు, ఇతర ప్రాంతాల్లో నేర నియంత్రణలో భాగంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేర నియంత్రణ లక్ష్యంగా పోలీసుశాఖ సమిష్టి కృషితో ముందుకు సాగుతోందని వెల్లడించారు. మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్నట్లు వివరించారు. పోక్సో చట్టంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. కేసు నమోదైన ఆరు నెలలోపు శిక్షలు పడుతున్నాయన్నారు. పోలీసు దర్యాప్తు పక్కాగా జరుగుతోందని, నేరస్తులకు గతంలో పోల్చితే ప్రస్తుతం శిక్షలు ఎక్కువగా పడుతున్నాయని తెలిపారు.


సున్నంవారిగూడెంలో జరిగిన రాజయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న కిరణ్

సున్నం రాజయ్య ఆశయాలు కొనసాగిస్తాం

- వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - అల్లూరి జిల్లా విలేకరుల యంత్రాంగం

సిపిఎం భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య సేవలు మరువలేనివని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని పలువురు వక్తలు అన్నారు. రాజయ్య ఐదో వర్ధంతిని పురస్కరించుకొని అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీలో ఆదివారం పలుచోట్ల ఆయనకు ఘన నివాళులర్పించారు. విఆర్.పురం మండలంలోని సున్నంవారిగూడెంలో రాజయ్య స్వగృహం వద్ద ఆయన సతీమణి చుక్కమ్మ, కుటుంబ సభ్యులు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలమాలలు ఉంచి అరుణాంజలి ఘటించారు. అక్కడ జరిగిన సభలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ రాజయ్య తన జీవితాంతం ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కోసం పోరాడారన్నారు. ఆయన కాలంలో తలపెట్టిన భూ ఉద్యమాలు, తునికాకు, వెదురు కార్మికుల పోరాటాలు, గిరిజన చట్టాల పరిరక్షణ పోరాటాలు, పోలవరం ఉద్యమం మరువరాని ఘట్టాలని గుర్తు చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఎటువంటి గర్వం లేని మనిషిగా మెలిగారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు లోతా రామారావు, సున్నం రాజులు, మండల వాణిశ్రీ, నాయకులు పల్లపు వెంకట్, మేకల నాగేశ్వరావు, బాబు బొర్రయ్య, సోయం చినబాబు, ఎంపిపి కారం లక్ష్మి పాల్గొన్నారు. ఎటపాక మండలం మురుమూరులో సిపిఎం మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, తదితరులు రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతూరులోని శ్యామల వెంకటరెడ్డి భవనంలో నిర్వహించిన రాజయ్య వర్ధంతి సభలో సిపిఎం జిల్లా నాయకులు బి.కిరణ్ మాట్లాడారు. కూనవరంలో మర్రి శ్రీరామమూర్తి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, ఆపుల ఉపేంద్ర, బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య పాల్గొన్నారు.


ముంచింగిపుట్టులో ఆందోళన చేస్తున్న నాయకులు, యువకులు

గిరిజన యువతకు ఉద్యోగాల కల్పనలో అన్యాయం

- ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు (అల్లూరి జిల్లా)

ఆదివాసీ యువతకు ఉద్యోగాల కల్పనలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ అల్లూరి జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్న పడాల్ అన్నారు. ఆదివాసీలకు షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల్లో వంద శాతం రిజర్వేషన్ కల్పించాలని, మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులను మినహాయించాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన 'ఆదివాసీ యువగళం' జీపుజాతా మూడో రోజుకు చేరుకుంది.

ఆదివారం కిలగడ, సుజనకోట, బంగారు మెట్ట, కొత్తూరు గ్రామాల మీదుగా ముంచింగిపుట్టు మండల కేంద్రానికి జాతా రాగా స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. మండల వీధులగుండా ర్యాలీ సాగింది. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.ఎం.శ్రీను అధ్యక్షతన జరిగిన సభలో ధర్మన్న పడాల్ మాట్లాడుతూ ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ఈ నెల 9న ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తాజా మెగా డిఎస్‌సిలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. అల్లూరి జిల్లాలో 400 పోస్టులకుగాను ఆదివాసీలకు 24 మాత్రమే దక్కుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సిఎం చంద్రబాబు నాయుడు నిలబెట్టుకోవాలని కోరారు. ఈ నెల ఒకటి నుంచి చేపట్టిన యువగళం జీపుజాతాకు అన్నిచోట్లా విశేష స్పందన దక్కుతోందని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ, గిరిజన సంఘం నాయకులు సాగిన సత్యనారాయణ, కూడా రాధాకృష్ణ, భాను, సిహెచ్.రావు, వెంగళ జగన్, జె.చలపతి, పాల్గొన్నారు.

టిటిడిలో ఎఐ విధానంపై మాజీ ఇఒ సంచలన వ్యాఖ్యలు

- 'ఎఐ' పై అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం బాధాకరం
- టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

తిరుమల శ్రీవారి దర్శనంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వినియోగంపై మాజీ ఇఒ, సీనియర్ ఐఎఎస్ అధికారి ఎల్‌వి సుబ్రహ్మణ్యం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆలయంలో గంటలో స్వామివారి దర్శనం అనేది అసంభవమని అన్నారు. ప్రస్తుతం ఉన్న విధానాన్ని మించి దర్శనంలో మార్పు చేసే అవకాశం లేదని పేర్కొన్నారు. ఎఐ పేరుతో టిటిడి ధనాన్ని వృథా చేయడం మంచిది కాదన్నారు. ఈ వ్యాఖ్యలను టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు ఖండించారు. టిటిడిలో ఎఐ విధానం అమలు చేయాలనే అంశాన్ని తప్పుబడుతూ ఎల్‌వి సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలను ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు ఖండించారు. తిరుమలలో శ్రీవారి క్యూ కాంప్లెక్సుల్లో సామాన్య యాత్రికులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఉచితంగా గూగుల్ / టిసిఎస్‌లతో పాటు ఇతర సంస్థల సహకారంతో అధునాతన ఎఐ టెక్నాలజీ ఉపయోగించి నిర్దేశించిన సమయంలోపు యాత్రికులకు దర్శనం కల్పించాలని టిటిడి పాలకమండలి నిర్ణయించిందని తెలిపారు. యాత్రికులకు ముందుగా తెలియడంతో కంపార్ట్మెంట్‌లలో ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఇతర ఆలయాలను సందర్శించేందుకు వీలు ఉంటుందన్నారు. ఒక సీనియర్ అధికారిగా పని చేసిన అనుభవం ఉన్న ఎల్‌వి సుబ్రహ్మణ్యం, తిరుమలలో ఎఐ టెక్నాలజీ నిరుపయోగమని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని, దాతల సహాయంతో టిటిడిలో ఉచితంగా చేస్తున్న పనిని కూడా వృథా అని అనడం ఆయన విజ్ఞతకు వదిలేస్తున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎఐ సాంకేతికతను ఉపయోగించి సేవలను సులభతరం చేస్తుంటే, అదే పద్ధతిలో టిటిడిలో కేవలం దర్శనం సమయాన్ని యాత్రికులకు ముందస్తుగా తెలియజేసేందుకు, మరింత సౌకర్యవంతంగా, సులభతరం చేసేందుకు మాత్రమే ఎఐ టెక్నాలజీని ఉపయోగించేలా నిర్ణయించామన్నారు.

జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం



- కొపనాతి వీర్రాజు
కరెంట్ అఫైర్స్ ఎక్స్‌పర్ట్,
పాతూరుగ్రామం, నిజాంపట్నం మండలం, బాపట్ల జిల్లా,
సెల్ : 8106525320

1. జాతీయ వైద్యుల (నేషనల్ డాక్టర్స్ డే) దినోత్సవం ఏ తేదీన జరుపుకుంటారు ?
(1) జూలై - 1 (2) జూన్ - 30
(3) జూలై - 30 (4) ఆగస్టు - 30

2. వరకట్న నిషేధ చట్టం అమల్లోకి వచ్చిన సంవత్సరం ?
(1) 1961 (2) 1969 (3) 1971 (4) 1973

3. జిఎస్‌టిని అమలుపర్చిన మొదటి రాష్ట్రం పేరేమిటి?
(1) అస్సాం (2) మేఘాలయ (3) త్రిపుర (4) నాగాలాండ్

4. పురుషుల హాకీ ప్రపంచ కప్ -2025 ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఎక్కడ జరగనుంది ?
(1) నెదర్లాండ్ (2) బెల్జియం (3) జపాన్ (4) 1, 2

5. చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవం ఏ తేదీన జరుపుకుంటారు?
(1) జూలై 1 (2) జూన్ 9 (3) జూలై 13 (4) ఆగస్టు 3

6. ఆర్ఏడబ్ల్యూ (రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్) నూతన డైరెక్టర్‌గా ఎవరు నియమితులయ్యారు ?
(1) పరాగ్‌జైన్ (2) రవి సిన్హా
(3) అలోక్ జోషి (4) ప్రదీప్ రావత్

7. ఇటీవల తన పదవీ కాలాన్ని జూన్ 30, 2026 వరకు పొడిగించబడిన ఇదిఆర్ఐ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్) ఛైర్మన్ పేరేమిటి?
(1) రవి అగర్వాల్ (2) రవి సిన్హా
(3) ప్రకాష్ శ్రీ వాస్తవ (4) జైశంకర్

8. ఇటీవల రాజ్యాంగ న్యాయస్థానం ద్వారా సస్పెండ్ చేయబడిన థాయిలాండ్ ప్రధానమంత్రి ఎవరు ?
(1) ఇంగ్లీష్ షిన ప్రత (2) పెటోం గ్టార్న్ షినవత
(3) థాక్సిన్ (4) షేన్ బాయ్ హాన్ మానెట్

9. భారత ప్రధాని నరేంద్ర మోడీ డిజిటల్ ఇండియాను



ఎప్పుడు ప్రారంభించారు ?
(1) జూలై 1, 2015 (2) నవంబర్ 8, 2016
(3) జనవరి1, 2020 (4) జనవరి 1, 2017

10. సుప్రీంకోర్టు చరిత్రలో తొలిసారిగా ప్రత్యక్ష నియామకాలు ఉద్యోగోన్నతుల్లో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు రిజర్వేషన్లు ఏ తేదీ నుండి అమల్లోకి వచ్చాయి ?
(1) జూన్ 23, 2025 2) జనవరి 26, 2020
(3) ఆగస్టు 15, 2024 (4) ఆగస్టు 15, 2025

11. ఇటీవల నౌకాదళంలో చేరిన యుద్ధనౌక "ఐఎన్ఎస్ తమాల్" ఏ దేశ సహకారంతో తయారు చేయబడింది ?
(1) ఫ్రాన్స్ (2) రష్యా (3) ఇజ్రాయిల్ (4) స్పెయిన్

12. ఇటీవల ఫిడే (ప్రపంచ చెస్ సమాఖ్య) విడుదల చేసిన తాజా ర్యాంకింగ్ జాబితాలో భారత నెంబర్ వన్‌గా నిలిచిన ఈ క్రింది చెస్ క్రీడాకారుని గుర్తించండి ?
(1) దొమ్మరాజు గుకేష్ (తమిళనాడు)
(2) ప్రజ్ఞానంద (తమిళనాడు)
(3) ఇరిగేసి అర్జున్ (తెలంగాణ)
(4) పెంటేల హరికృష్ణ (ఆంధ్రప్రదేశ్)

13. జాతీయ వెయిట్ మహిళల బాక్సింగ్ బోర్డ్ - 2025 ఒలింపిక్ పతాక విజేత ఎవిన్ ఎన్ని కేజీల విభాగంలో లాటు యాదవ్‌పై గెలుపొందింది స్వర్ణం సాధించింది?
(1) 50 (2) 51 (3) 49 (4) 75

14. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ చైల్డ్ డెవలప్‌మెంట్ పేరును ఈ క్రింది ఎవరి పేరు పెట్టారు ?
(1) సావిత్రిబాయి పూలే (2) దొక్కా సీతమ్మ
(3) సరోజినీ నాయుడు (4) జ్యోతిరావు పూలే


15. విలింబ్లన్ చరిత్రలో అత్యంత వేగవంతమైన (150 km/h) సర్వీస్ రికార్డ్ ఎవరి పేరిట ఉంది ?
1) పెరికార్డ్ (ఫ్రాన్స్) (2) టేలర్ డెంట్
(3) రాఫెల్ నాదల్ (స్పెయిన్) (4) నోవాక్ జకోవిచ్ (సెర్బియా)

16. యురేనియం లేదా ప్లుటోనియం లాంటి సంప్రదాయ విచ్ఛిత్తి పదార్థాలు లేకుండా పనిచేసే విధ్వంసాత్మక రకం హైడ్రోజన్ బాంబును ఇటీవల ఏ దేశం పరీక్షించింది ?
(మెగ్నీషియం హైడ్రైడ్ ఆధారిత ఫ్యూజన్ వంటి అధునాతన పద్ధతులను ఉపయోగించింది)
(1) ఇజ్రాయిల్ (2) ఫ్రాన్స్ (3) చైనా (4) కొరియా

17. జూలై 1, 2025న క్వాడ్ (QUAD) విదేశాంగ మంత్రుల సమావేశం వాషింగ్టన్ (అమెరికా)లో జరిగింది. అయితే Quad దేశాల జాబితాలో లేని దేశాన్ని గుర్తించండి?
(1) ఆస్ట్రేలియా (2) భారత్ (3) అమెరికా (4) జర్మనీ

18. కోర్టు ధిక్కరణ కేసులో ఆరు నెలలు జైలు శిక్ష పడిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఎవరు ?
(1) షేక్ హసీనా (2) షేక్ ముజిబుర్ రెహమాన్
(3) ఖలీదా జియా (4) మహ్మద్ యూనస్

19. 17వ బ్రిక్స్ సదస్సు 2025 జూలై 6, 7 తేదీల్లో ఎక్కడ జరిగింది?
(1) రియో డిజనీరో (బ్రెజిల్) (2) కసాన్ (రష్యా)
(3) జోహన్స్ బర్గ్ (దక్షిణాఫ్రికా) (4) న్యూ ఢిల్లీ (భారత్)



20. ప్రస్తుత పార్లమెంటరీ వ్యవహారాలు, మైనార్టీల శాఖమంత్రి ఎవరు ?
(1) మహమ్మద్ ఇక్బాల్ (2) కిరణ్ రిజిజు
(3) ప్రహ్లాద్ జోషి (4) అర్జున్‌రామ్ మేఘ్వాల్

21. 2026 జూన్‌లో నాసా చేపట్టనున్న రోస్కో -స్పేస్ సోయజ్ ఎంఎస్- 29 అనే అంతరిక్ష నౌకలో ఫ్లైట్ ఇంజనీర్‌గా ఎన్నికైన భారత సంతతి వ్యక్తి ఎవరు ?
(1) సునీత విలియమ్స్ (2) కల్పనా చావ్లా
(3) అనిల్ మీనన్ (4) శంకర్ దాదా

22. ఇటీవల భారత ఫుట్‌బాల్ కోచ్ పదవి నుంచి వైదొలగిన ఈ క్రింది కోచ్‌ను గుర్తించండి ?
(1) మనోలో మార్ క్వెజ్ (స్పెయిన్)
(2) ఇగోర్ స్టిమాక్ (క్రోయేషియా)
(3) నయిమ్ (ఇండియా)
(4) స్టెఫెన్ కాన్ స్టాంటన్ (ఇంగ్లాండ్)

23. ఇటీవల ఘనా జాతీయ గౌర పురస్కారం ద ఆఫీసర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద స్టార్ ఆఫ్ ఘనా పురస్కారం పొందిన ఈ క్రింది భారతీయుడిని గుర్తించండి ?
(1) ఎస్.జైశంకర్ (2) నరేంద్ర మోడీ
(3) ద్రౌపదిముర్ము (4) భూపేంద్ర యాదవ్

24. ఇటీవలలో మొదటిసారిగా సోలార్ బస్‌స్టేషన్ ఈ క్రింది ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు ?
(1) సూరత్ (గుజరాత్) (2) ముంబై (మహారాష్ట్ర)
(3) జైపూర్ (రాజస్థాన్) (4) లక్నో (మధ్య ప్రదేశ్)

25. ఇటీవల మరణించిన ఫుట్‌బాల్ ప్లేయర్ డియాగో జోటా ఏ దేశానికి చెందిన క్రీడాకారుడు ?

(1) పోర్చుగల్ (2) ఫ్రాన్స్ (3) బ్రెజిల్ (4) జర్మనీ

26. ఇటీవల ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశ అత్యున్నత పురస్కారం "ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ & టొబాగో" పురస్కారం పొందిన భారతీయుడిని గుర్తించండి
(1) జైశంకర్ (2) నరేంద్ర మోడీ
(3) ద్రౌపది ముర్ము (4) భూపేంద్ర యాదవ్

27. అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్ (నీరజ్ చోప్రా క్లాసిక్) జూలై 4, 5, 6 తేదీల్లో భారత్‌లో ఎక్కడ జరిగింది?
(1) శ్రీ కంఠీరవ స్టేడియం (బెంగళూరు)
(2) మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియం (ఢిల్లీ)
(3) వాంఖడే స్టేడియం (ముంబై)
(4) ఇందిరా గాంధీ స్టేడియం (ఢిల్లీ)

28. వరల్డ్ జూనోసిస్ డే ఎప్పుడు జరుపుకుంటారు ?
(1) జూలై 6 (2) జూలై 8 (3) జూలై 9 (4) జూలై 10

29. గ్లోబల్ పీస్ ఇండెక్స్ - 2025 భారత్ ర్యాంక్ ఎంత ?
(1) 115 (2) 116 (3) 117 (4) 126

30. అండర్ -19 లో వేగవంతమైన సెంచరీ చేసిన క్రికెటర్‌ను గుర్తించండి ?
(1) కమ్రాన్ గులామ్ (పాక్) (2) వైభవ్ సూర్య వంశీ (భారత్)
(3) నజ్మల్ షాంటో (బంగ్లా) (4) సర్ఫరాజ్‌ఖాన్ (భారత్)

31. 2025 జూలై నెలలో నరేంద్ర మోడీ పర్యటించిన ఈ క్రింది దేశాన్ని గుర్తించండి ?
(1) ఘనా (2) ట్రినిడాడ్ (3) అర్జెంటీనా (4) బ్రెజిల్

32. 17వ బ్రిక్స్ సదస్సు అధ్యక్షుడిని గుర్తించండి ?
(1) వ్లాదిమిర్ పుతిన్ (రష్యా) (2) లూలా డిసిల్వా (బ్రెజిల్)
(3) అబ్దుల్ ఫతా అల్ సిసి (ఈజిప్టు) (4) జిన్ పింగ్ (చైనా)

33. ఇటీవల ఎలాన్‌మస్క్ ప్రకటించిన నూతన పార్టీ పేరు ఏమిటి?
(1) నేషనల్ పీపుల్స్ పార్టీ (2) డెమోక్రటిక్ పార్టీ
(3) అమెరికా పార్టీ (4) రిపబ్లిక్ పార్టీ

34. బాక్సింగ్ ప్రపంచకప్ -2025 సాక్షి ఎన్ని కేజీల విభాగంలో యోస్లిన్ ఫెరేజ్ (అమెరికా) పై గెలుపొంది స్వర్ణం సాధించింది ?
(1) 48 (2) 54 (3) 50 (4) 65

35. ప్రతిష్టాత్మక పాలిగ్రాన్ మ్యూజిక్ స్కిల్ అవార్డు రేసులో నిలిచిన భారత క్రీడాకారిణి ఎవరు ?
(1) రాణీరాంపాల్ (2) వందన కటారియా
3) దీపిక (4) గొంగిరి త్రిష

36. వరల్డ్ చాక్లెట్ డే ఎప్పుడు జరుపుకుంటారు ?
(1) జూలై -7 (2) జూలై - 8 (3) జూలై - 9 (4) జూలై - 10

37. కర్బన ఉద్గారాల నెట్ జీరో స్థాయి భారత్ లక్ష్యం ?
(1) 2040 (2) 2050 (3) 2070 (4) 2060

38. కేంద్ర ప్రభుత్వం నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఏ సంవత్సరంలో ప్రారంభించింది ?
(1) 2023 (2) 2024 (3) 2025 (4) 2026

39. ఇటీవల బద్దలైన లెవోటోబి లకి అగ్ని పర్వతం ఏ దేశంలో కలదు ?
(1) ఇండోనేషియా (2) టర్కీ (3) జపాన్ (4) ఇజ్రాయిల్

40. ఇటీవల వార్తల్లో నిలిచిన వంశిక అగర్వాల్ ఏ ఆటకు చెందిన క్రీడాకారిణి ?
(1) ఫుట్‌బాల్ (2) టెన్నిస్ (3) క్రికెట్ (4) చెస్

41. బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారమైన "గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదర్న్ క్రాస్" పొందిన ఈ క్రింది భారతీయుడిని గుర్తించండి ?
(1) ద్రౌపది ముర్ము (2) నరేంద్ర మోడీ
(3) ఎస్.జైశంకర్ (4) రాజ్‌నాథ్‌సింగ్

42. ప్రభుత్వ ఉద్యోగాలకు నేరుగా జరిగే అన్ని రిక్రూట్మెంట్లలో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్టు ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది ?
(1) మహారాష్ట్ర (2) న్యూఢిల్లీ (3) బీహార్ (4) ఆంధ్రప్రదేశ్

43. జనవరి 1, 2026 నుంచి యూరో కరెన్సీని అమలు చేయనున్న ఈ క్రింది దేశాన్ని గుర్తించండి ? (యూరో జోన్ 21వ దేశం)
(1) క్రోయేషియా (2) బెలారస్ (3) బల్గేరియా (4) ఇంగ్లాండ్

44. ఇటీవల గోవా గవర్నర్‌గా నియమితులైన తెలుగు వ్యక్తిని గుర్తించండి ?
(1) కంభంపాటి హరిబాబు (2) బండారు దత్తాత్రేయ
(3) పి అశోక్ గజపతిరాజు (4) కుంబా రవిబాబు

45. ప్రస్తుతం హర్యానా గవర్నర్‌గా ఎవరు ఉన్నారు ?
(1) బి.డి. మిశ్రా (2) అశీం కుమార్ ఘోష్
(3) బి.సత్యనారాయణ (4) కవీందర్ గుప్తా

46. ఇటీవల మరణించిన సరోజ దేవి (సినిమా రంగం) ఏ సంవత్సరంలో పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు ?
(1) 1969 (2) 1992 (3) 2008 (4) 2010

47. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా ఎవరు ఉన్నారు ?
(1) రాయపాటి శైలజ (2) వి. అనిత
(3) గుమ్మడి సంధ్యారాణి (4) ఎల్.శ్రీలక్ష్మి

48. ఇటీవల ఆస్ట్రేలియా దేశం 19 దేశాలతో కలిసి నిర్వహించిన సైనిక విన్యాసాల పేరేమిటి?
(1) ఎక్సర్సైజ్ టాలిస్మాన్ సాబర్ (2) టైగర్ ట్రయంఫ్
(3) ఆస్ట్రా హింద్ (4) యుద్ధ అభ్యాస్

49. 2015 నుంచి ప్రతి సంవత్సరం జూలై -15న జరుపుకునే వరల్డ్ యూత్ స్కిల్స్ డే 2025 థీమ్ ఏమిటి ?
(1) youth empowerment through AI and digital skill
(2) young & youth generation
(3) youth empowerment
(4) ఏదీకాదు

50. ప్రపంచంలోని తొలి డిజిటల్ దేశం పేరు ?
(1) వాటికన్‌సిటీ (2) తువాలు (3) ఆస్ట్రేలియా (4) నౌరు

ఇవి మీకు తెలుసా...

- భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డిఎఐ) ఛైర్మన్‌గా అజయ్ సేథ్ జూలై 24న నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల లేదా ఆయనకు 65 ఏళ్ల వచ్చే వరకు లేదా తదుపరి ఉత్తర్వుల వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.
- బిటన్ నుంచి 2025, జూలై 25న మాలే చేరుకున్న భారత ప్రధాని మోదీ మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మాల్దీవులకు రూ.4,850 కోట్ల రుణాన్ని మోదీ ప్రకటించారు.
- ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) మొదటి మహిళా ఉపకులపతిగా ఉమా కాంజిలాల్ 2025, జూలై 25న నియమితులయ్యారు.
- స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, సమగ్రమైన పర్యావరణం మానవ హక్కు అని అంతర్జాతీయ న్యాయస్థానం 2025, జూలై 23న తీర్పు వెలువరించింది. భూగోళాన్ని వాతావరణ మార్పుల నుంచి పరిరక్షించేందుకు చర్యలు చేపట్టని దేశాలు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించినట్లేనని కోర్టు స్పష్టం చేసింది.
- జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సి) ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి ఆనంద్ స్వరూప్ నియమితులయ్యారు.
- అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని లెపరాడా జిల్లాలో ఇటీవల యుకాయిమా మలక్కాగా అనే సరికొత్త సీతాకోక చిలుక జాతిని అధికారికంగా గుర్తించారు.
- 'ఒరిజినల్ సిన్ : ప్రెసిడెంట్ బైడెన్ డిక్లైన్, ఇట్స్ కవర్ - అప్, అండ్ హిజ్ డిజాస్ట్రస్ ఛాయిస్ టు రన్ ఎగైన్' పుస్తకాన్ని జేక్ ట్యాపర్, అలెక్స్ థాంప్సన్ రచించారు.

జవాబులు

(1) 1 (2) 1 (3) 1 (4) 4 (5) 1 (6) 1 (7) 1 (8) 2 (9) 1 (10) 1 (11) 2 (12) 2 (13) 4 (14) 1 (15) 1 (16) 3 (17) 4 (18) 1 (19) 1 (20) 2 (21) 3 (22) 1 (23) 2 (24) 1 (25) 1 (26) 2 (27) 1 (28) 1 (29) 1 (30) 2 (31) 4 (32) 2 (33) 3 (34) 2 (35) 3 (36) 1 (37) 3 (38) 1 (39) 1 (40) 4 (41) 2 (42) 3 (43) 3 (44) 3 (45) 2 (46) 2 (47) 1 (48) 1 (49) 1 (50) 2

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 4 ఆగస్టు 2025



"పాతను బతికించటానికి
కొత్త చిట్కాలు
వెతుకుతున్నారు
కొత్తను హతమార్చటానికి
పాత కత్తులు నూరుతున్నారు."
- శ్రీశ్రీ (1970లో)



అ'ధర్మ స్థల'

అక్కడ ధర్మానికి తావు లేనేలేదు
అన్యాయాక్రమాలకు అనువైన 'స్థల'
ధర్మస్థల కాదది; అధర్మస్థల
ధర్మస్థల పక్కనే ఉజిరే ఓ ఊరు
నేత్రావతి నదీ జలాల సాక్షిగా
హత్యాకాండ చెలరేగిన నేల
అడవితల్లి, పుడమితల్లి వెరసి
అన్యాయాలకు అండైన వేళ !

తవ్వే కొద్దీ... తీసేకొద్దీ
అక్రమాస్తుల్లాగా అస్థిపంజరాలు
వందల సంఖ్యలో ఎముకల గూళ్ళు
1979లో వేదవల్లి ఓ ఉపాధ్యాయినిని
పట్టపగలే బాత్రూంలో భస్మమైంది
1986లో పద్మలత ఎన్నికల్లో నామినేషను వేస్తే
నది ఒడ్డున నగ్నంగా శవమైంది
2003లో డాక్టరు కోర్సు చదివే
అనన్య భట్ అడ్రసు గల్లంతు
న్యాయమడిగిన తల్లి సుజాతాభట్
ఇళ్ళు తగులబెట్టి పళ్ళికిలించారు
2012లోనూ అందమైన యువతి అంతమైంది
ఆ అధర్మస్థల చుట్టూ అసహజ మరణాలు
లైంగిక దాడులతో దడదడ లాడుతున్నది
అదేమన్నందుకు అన్నాచెల్లెళ్ళు డబులు మర్డర్

ధర్మస్థలను పరిరక్షించే నాథుడే లేడా?
అధర్మాన్ని ఆపే ఆర్త రక్షకులే లేరా?

– డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
9490400858

హత్యాచార స్థలి

ప్రాకారాల్లో మట్టిలో కలిసిన రక్తం..
నిలువుటంగీల మీద అతికిన మెత్తని ఉసుళ్లు..
గర్భగుడి ద్వారం మూసుకున్నప్పుడు
దేవుడు కూడా కళ్లు మూసుకున్నాడా?
అని అడిగే నిశ్శబ్ద ప్రశ్నలు.
శిల్పాల కళ్లలో నీళ్లు నిలిచిపోయాయి.
నంది ఏడుపు శబ్దం వినిపించకుండా వణికిపోయాడు.
అప్పుడు ఆ రాత్రి..
జ్వాలల్లా మండే పెదవులు గాడ్పులా గుసగుసలాడాయి.
కాళ్లకు కట్టిన పట్టీలు భజనల గజ్జెలై పాడాయి.
అర్ధచంద్రుడు ఆకాశంలో ముక్కలైపోయాడు
తల్లి ఒడిలో పడిన పువ్వులూ నిప్పులైపోయాయి.
ఇప్పుడు ఆ ప్రాంగణం..
మొక్కలు కూడా వేళ్లతో చెవులు మూసుకుంటున్నాయి
గోడలు తమలో తామే 'ఇది దైవికత కాదు, మృత్యుకత'
అని కథలు చెప్పుకుంటున్నాయి
ఏడుపు అంతా గుడి గోపురం పైకి వెళ్లి
విగ్రహాల ముఖాన మబ్బులై తేరుతున్నది
తర్వాత ఉదయం
రాతిలోని నీళ్ల మొలకెత్తుతున్నాయి
గాయాల్లోంచి నిజం పుడుతోంది
'ఆలయం రాళ్లతో కాదు,
మనుషుల హృదయాలతో కట్టాలి!'
అని కూస్తున్నాయి పక్షులు
ఒక చిన్నపువ్వు రక్తంపై తలెత్తి
'భయపడకు' అని చెప్తోంది

– శాంతిశ్రీ
83338 18985

విచికిత్స

బిక్కుబిక్కుమంటోన్న ప్రజాస్వామ్య దీపానికి
ప్రతిరూపం లాంటి పార్లమెంటు భవనం మీదా,
దిక్కుమాలిన తల్లి
గాలికొదిలేసిన మట్టి బొమ్మ లాంటి
చిట్టి తమ్ముడి చేతిలోనూ
ఒక్కలాగే నవ్వుల్ని రువ్వగలిగే
మువ్వన్నెల జెండా...!

విలక్షణమైన నీ మూడు రంగుల్నీ
ఉదాత్తంగా కీర్తించాలనే ఉబలాటంలో...
వెన్న వంటి అమృత హృదయులకీ
వెన్నెల గిన్నెలంటి తియ్యని నవ్వులకీ
సంకేతం ఆ తెలుపు రంగు
అని అందంగా తెలపాలనుకుటే....

అలౌకిక భావాల నల్లమందు బిల్లల్ని నోట్లో కుక్కి
గతం మిథ్యా వైభవాల
జోరీగల్ని చెవుల్లోకి చొప్పిస్తూ
విచ్చలవిడిగా వీరంగం వేస్తోన్న
ముష్కర ఏలికల మచ్చల పులిని చూసి
వెన్నులోనే కాదు, నా పెన్నులోనూ వణుకు పుట్టి
వాక్యం వెనక్కి వెనక్కి నక్కిపోయింది!

వెల్లివిరిసిన ప్రగతికీ, తుళ్ళితుళ్ళి గంతులేసే జాతికీ
సంకేతం ఆకుపచ్చ అని ఆహ్లాదంగా పాడాలనుకుంటే...
లోతుకుపోయిన ఆకలి కడుపులోకి
మోకాళ్ళు రెండూ దూర్చి
పాడుపడిన పాక ముందు పీడకలలు కంటోన్న
పసితనాన్ని వెక్కిరిస్తూ
ఎక్కడినుంచో ఎగురుకుంటూ వచ్చిందో ఎంగిలాకు!
దాన్ని చూడగానే చెయ్యి పట్టుతప్పి
నా కలం అచేతనంగా కిందికి జారిపోయింది!

ఉదయారుణ కాంతికీ, హృదయంలో శాంతికీ
అసలు సిసలు ఆనవాలు అదిగో, ఆ కాషాయమే!
అని సందడిగా సందేశం ఇద్దామనుకుంటే...
కీకారణ్యాల్లోని పచ్చటి ఆకులనుంచి స్రవిస్తోన్న
వెచ్చటి నెత్తుటి ధారల్నీ
మైదానాలమీద పంట పొలాల
కంఠనాళాల్లోంచి పెల్లుబుకుతున్న
అకుంఠిత ఉద్యమ గర్జనల్నీ
నిశితంగా పరిశీలించిన నా పెన్ను
ఆవేశం పట్టలేక, ఆపవోయ్....
నీ అసందర్భపు చిలక పలుకులు!
అంటూ ఒక్క ఉదుటున నాపై విరుచుకుపడింది!

ఈ సందిగ్ధపు సంకట స్థితిలో
నా ముచ్చటైన మూడురంగుల జెండా...!
నిన్నెలాగ కీర్తించాలో, ఏ రీతిన వర్ణించాలో
అస్సలు అర్థం కావటం లేదు!

– పతివాడ నాస్తిక్
94417 24167

తెలుగు భాషా సాహిత్యాల సేవకుడు 'మండలి'

రాజకీయరంగంలో ఉంటూ తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు, విస్తరణకు పాటుపడ్డ నాయకుడిగా మండలి వెంకట కృష్ణారావు చరిత్రలో నిలుస్తారు. ఇది ఆయన శత జయంతి ప్రారంభ సంవత్సరం. 1926 ఆగస్టు 4న కృష్ణా జిల్లాలోని పల్లెవాడ గ్రామంలో జన్మించిన మండలి వెంకట కష్ణారావు, బాల్యంలోనే గాంధేయ తత్వానికి ఆకర్షితులయ్యారు. ఆయన తండ్రి మండలి వెంకట్రామయ్య ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు. పాఠశాల ఇంటి వాతావరణంలోనే కష్ణారావు మనసులో దేశభక్తి భావాలు నాటుకున్నాయి. స్వాతంత్ర్యోద్యమంపై మక్కువ పెరిగింది. గాంధీ నడిపిన 'యంగ్ ఇండియా', 'హరిజన్' వంటి పత్రికల ప్రభావం ఆయన ఆలోచనలపై తీవ్రంగా పడింది. గ్రామాల్లో నాటకాలు, పుస్తక ప్రదర్శనలు, జాతీయ పాటలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అవనిగడ్డ హైస్కూల్లో చదువుతున్న సమయంలో, 'చదువుతోపాటు సేవ కూడా అవసరం' అనే భావనతో, స్థానిక ప్రజలకు అక్షరాస్యత నేర్పే కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనేవారు. మచిలీపట్నంలోని హిందూ కళాశాలలో చేరిన తర్వాత, ఆయన విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, ఖద్దరు ఉద్యమాల ప్రభావం ఆయన ఆలోచనలపై స్పష్టంగా కనిపించేది. సర్వోదయ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకొని, కుల, వర్గ, మత భేదాలకి అతీతంగా, సమానత్వాన్ని జీవిత ధర్మంగా పాటించారు.

స్వాతంత్ర్యం వచ్చాక గ్రామాల్లో అభివద్ధికి అవసరమైన సంకల్పం, మార్గదర్శకత్వం కలిగిన నాయకులు అవసరం ఏర్పడింది. మండలి కష్ణారావు కైకలూరు నియోజకవర్గంలోని ప్రజల అవసరాలను అధ్యయనం చేశారు. ప్రజల దైన్యాన్ని, సమస్యలను అవగాహన చేసుకుని, మౌలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. సత్యం, పారదర్శకత, ప్రజల ముందు జవాబుదారీ తనాన్ని ఒక ఆచరణాత్మక సిద్ధాంతంగా తీసుకున్నారు. గౌరవ



(నేడు శతజయంతి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా)

పదవులను ఆశించే వ్యక్తిగా కాకుండా, సమస్యలపై పోరాటం చేసే నాయకుడిగా ఆయన సుస్థిర స్థానం పొందారు. కృష్ణా జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్‌గా, అవనిగడ్డ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పల్లెల అభివద్ధికి, పౌరుల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేశారు. 1972- 1985 మధ్య వరుసగా మూడు సార్లు అవనిగడ్డ నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. అందులో రెండు సార్లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఆయనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది.

విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో, తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధికి మంచి కృషి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక వేదికపైకి తీసుకువచ్చే ప్రయత్నంగా ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ తెలుగు కేంద్రం స్థాపనకు కషి చేయడం ఆయన భాషాభిమానాన్ని చాటి చెబుతుంది. సాంస్కృతిక శాఖలో, ప్రాంతీయ కళల అభివృద్ధికి, స్థానిక కళాకారులకు గుర్తింపు కలిగించే పథకాలను ప్రవేశపెట్టారు. తెలుగు సంస్కృతి విలువలు యువతలో నాటడానికి పాఠశాల స్థాయిలో చైతన్య కార్యక్రమాలను ప్రారంభించారు. పరిపాలనా వ్యవస్థను, సామాజిక స్పృహతో నడిపేలా ఆయన చేసిన కషి, ఆయనను ఒక మంత్రిగా కాకుండా, ఒక మార్గదర్శిగా నిలబెట్టింది. 1977 దివిసీమ ఉప్పెన సమయంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి, నేరుగా కార్యక్షేత్రంలోకి దిగి ప్రజల ఇక్కట్లను బాపేందుకు పనిచేశారు. బాధితుల చుట్టూ దుఃఖం, విషాదం చుట్టుముట్టిన సమయంలో వెంకట కృష్ణారావు చూపిన స్పందన చరిత్రలో నిలిచిపోయింది. ఈ సేవా దక్షోణం వల్లే ఆయనకు 'దివిసీమ గాంధీ' అన్న గౌరవాన్ని ఇచ్చింది.

తెలుగు భాషా-సంస్కృతి పరిరక్షణలో ...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భాషా, సాంస్కృతిక అభివద్ధికి మార్గదర్శకంగా ఎన్నో కార్యాచరణలు రూపొందించబడ్డాయి. రాష్ట్రంలో కళల పట్ల ప్రజల్లో ఆసక్తి పెంపొందించేందుకు, కళాకారులకు సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పథకాలు చేపట్టింది. సాహిత్యం, సంగీతం, నాటకం, నత్యం, చిత్రకళ, శిల్పకళ వంటి ప్రకాశవంతమైన రంగాలకు అధికారికంగా ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక రంగంలో దేశానికి ఆదర్శంగా నిలిచింది. సాంస్కృతిక విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి మూడు ముఖ్యమైన అకాడమీలను రాష్ట్ర ప్రభుత్వం స్థాపించింది. 1957లో సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, 1961లో లలితకళా అకాడమీ ఏర్పాటు చేయబడ్డాయి. ఈ అకాడమీలను సమన్వయంతో పనిచేయించేందుకు రవీంద్ర భారతి ఆవరణలో కళాభవన్ నిర్మించబడింది. తన జీవితాన్నే భాషా సాహిత్యాల పరిరక్షణకు అంకితమిచ్చిన నాయకుడిగా మండలి వెంకట కృష్ణారావు చరిత్రలో నిలిచారు. విద్యా, సాంస్కృతిక శాఖామంత్రిగా ఆయన సేవలు మరువ లేనివి.

1975లో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతంగా నిర్వహించడం ఆయన పాత్ర కీలకం. ఈ మహాసభల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒకే వేదికపైకి తేవడమే కాక, తెలుగు భాష వైభవాన్ని ప్రపంచానికి తెలియజేయడంలో ఆయన తొలి పెద్ద అడుగు వేశారు. అదే సమయంలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించి, రచయితలను ఏకం చేయడం ద్వారా రచనల వికాసానికి దారులు తీశారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా, విదేశాల నుంచీ తెలుగువారు హాజరై భాషా ఐక్యతను చాటారు. ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పూర్తి మద్దతుతో మహాసభలు ఆదరణ పొందాయి. ఈ సందర్భంగా 'తరతరాల తెలుగు జాతి' పేరిట 40 రోజుల సాంస్కృతిక ప్రదర్శన హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. దీన్ని చిరస్థాయిగా ఉంచేందుకు సరూబాగ్ పబ్లిక్ గార్డెన్స్‌లో సాంస్కృతిక సంగ్రహాలయం నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. సాంస్కృతిక శాఖకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు కూడా ఆయన పట్టుదలతోనే సాధ్యమైంది. ఉర్దూ అకాడమీ, బాలల అకాడమీ వంటి కొత్త సృజనాత్మక శాస్త్ర సంస్థలను స్థాపించడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. వెంకట కృష్ణారావు గారి జీవితం నేటి నాయకులకు కాక యువతకూ ఒక విలువల పాఠశాలగా నిలుస్తుంది. మండలి వెంకట కృష్ణారావు గారి శతజయంతి మహోత్సవాలు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన 4-8-2025న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్నాయి.

– రేగుళ్ళ మల్లికార్జునరావు
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ

'మట్టి' కావాలిగానీ 'మనిషి' వద్దా?

సకల సంపదల సృష్టికి మూలమైన మట్టికి (భూమికి)- మనిషికి అనుబంధాన్ని ఒదులుకోకూడదన్న ప్రధాన ఇతివృత్తంతో ప్రదర్శించబడిన నాటకం 'మట్టి మనిషి'. 'ఆంధ్రా పెరల్ బగ్'గా విస్తృతంగా మన్ననలందుకున్న అలనాటి ప్రముఖ అభ్యుదయ రచయిత్రి డా.వాసిరెడ్డి సీతాదేవి- తన 'మట్టి మనిషి' నవలలో రైతాంగ జీవితాన్ని కళ్ళకు కట్టిన వైనం సూపర్. 1970 ప్రాంతంలో 'ఆంధ్రప్రభ'లో రెండేళ్లపాటు సీరియల్‌గా ప్రచురించబడిన ఈ నవల.. మట్టికి మనిషికి ఉండే సామాజిక సంబంధాలు, వాటి మంచిచెడ్డలు.. ఆ సంబంధాల్లో మార్పులను హేతుబద్ధంగా తర్కించింది. తెలుగు సాహిత్యంలో నన్నయ్య నుంచి నేటి వరకూ వెయ్యేళ్లలో వచ్చిన గొప్ప రచనల్లో పదమూడో స్థానంలో నిలిచినట్టు- 'మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్' అనే కాలమ్‌లో పేర్కొన్న ఈ నవలను నేషనల్ బుక్ ట్రస్ట్ వారు 14 భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురించారు. 1995 – 2000 మధ్యలో ఓ.యు. ఎం.ఏ ఫైనల్ విద్యార్థులకు ఇది ఓ పాఠ్యగ్రంథం. వాస్తవిక జీవితాన్ని ప్రతిబింబించే ఈ నవలను ప్రముఖ నాటకకర్త వల్లూరు శివప్రసాద్ నాటకీకరించారు. ఈనెల 2, 3 తేదీల్లో విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్ వారు ఎస్.ఎం.బాషా దర్శకత్వంలో- పది మంది మహిళలు సహా మొత్తం నలభై మంది కళాకారులు, ఇరవై మంది సాంకేతిక నిపుణులతో ప్రదర్శించారు. 4.05 గంటల పాటు సాగిన భారీ నాటక రాజం ప్రేక్షకుల్ని అలరించింది. రచయిత, దర్శకుడు.. ఇద్దరూ ఎన్నో బహుమతుల్ని కొల్లగొట్టినవారే. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, చింతపల్లి అనంత్ పాటలు అందించారు.

భూమి ఉత్పత్తి సాధనంగా కాక ఓ వ్యాపార సాధనంగా చూడబడుతున్న రోజుల్లో- భూమి ఉత్పత్తి సాధనం.. వ్యాపార సాధనం కాదు- అని రచయిత్రి



మట్టిమనిషి నాటకంలో ఒక దృశ్యం

కుండబద్దలు గొట్టిన వాస్తవాన్ని అంగీకరించి తీరాల్సిందే. భూమిని నమ్ముకోక వ్యాపార దృష్టితో అమ్ముకునే జీవితాల్లోని దుష్ఫలితాలకు నాటకం అద్దం పట్టింది. పారిశ్రామికీకరణ, రియల్ ఎస్టేట్‌ల పేరుతో సంభవిస్తున్న దుష్పరిణామాల నేపథ్యంలో ఆ వ్యాపారాలు జీవితాలను ఏ విధంగా అతలాకుతలం చేస్తున్నాయో ఐదున్నర దశాబ్దాల క్రితమే రచయిత్రి శాస్త్రీయంగా.. కన్విన్సింగ్‌గా వక్కాణించడం విశేషం. భూమి ఇచ్చే సకల సంపాదలనూ అనుభవిస్తాం.. కానీ భూమినే నమ్ముకునే మట్టిమనిషిని విస్మరిస్తాం.. మన మూలాల్ని తెలుసుకోడానికైనా 'మట్టి మనిషి'ని చూడటం అవశ్యం. స్పీడ్‌గా సాగే ప్రస్తుత మూస నాటక ప్రదర్శనలకు భిన్నంగా అలనాటి ఇతివృత్తానికి అనుగుణంగా- పైగా 'సూత్రధారి, నటి' ప్రక్రియతో నాటకాన్ని నడపడం నప్పింది. ఆరంభంలో సూత్రధారి పంచ్‌లు పేలాయి. 'అరసం' కళాతోరణంలో భాగంగా.. స్థానిక సాహితీ సాంస్కృతిక సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన 'మట్టిమనిషి'లో రాజర్షి (సాంబయ్య), కె గోవర్ధనరెడ్డి (వెంకటపతి), సురభి రాఘవ (కనకయ్య), కె.శేఖర్ రెడ్డి (బలరామయ్య), గుడివాడ లహరి (వరూధిని), చిరంజీవి దినేష్ (రవి), మాధవి తదితరులు పాత్రోచితంగా నటించి నాటకాన్ని రక్తిగట్టించారు. వై.గంగాధర్ (సంగీతం), భూదేవి, సురభి నిఖిలేష్, వశీమ్ (నేపథ్య గానం) తదితరులు నాటక విజయవంతానికి దోహదపడ్డారు. నాటకంలో లైట్స్ ఆఫ్ అండ్ ఆన్‌లు చాలా ఎక్కువై కంటిన్యుటీకి ఆటంకమవుతోందని ప్రేక్షకులు కాస్త అసహనం ఫీలయ్యారు. శివప్రసాదే సవినయంగా సభాముఖంగా అంగీకరించినట్లు- కొందరు నటుల తొట్రుబాటును మరిన్ని రిహార్సల్స్‌తో అధిగమించి పర్ఫెక్షన్ సాధించడంతో పాటు.. ప్రదర్శన నిడివి మూడు గంటలకు పరిమితం చేసుకోగలిగితే.. ఇంకా బాగుంటుంది. ఏమైనా అధిక వ్యయ ప్రయాసలతో ఇంత భారీ ప్రాజెక్టును చేపట్టిన నిర్వాహకులు ఎంతైనా అభినందనీయులు.

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్టు
99126 15747

ధీరజ్ కోట్ల కథా సాహిత్య పురస్కారాలు - 2025

పుట్టంరాజు బుల్లెయ్య- రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్టు, అద్దంకి వారి ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీ విమర్శకులు ఎన్.రవిశేఖర్ రెడ్డి ప్రదానం చేసే ధీరజ్ కోట్ల సాహిత్య పురస్కారాలు- 2025 కోసం 2023, 2024, 2025లలో ప్రచురితమైన కథా సంపుటాలను ఆగస్టు 31లోగా ఒక కాపీ పంపాలి. మొదటి బహుమతి రూ.10,000. రూ.1,116 చొప్పున నాలుగు బహుమతులిస్తారు. బహుమతికి ఎంపిక కాని పుస్తకాల ధరను చెల్లిస్తారు. పుస్తకాలు పంపవల్సిన **చిరునామా : శ్రీ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఇంటి నెం: 15-31, పుట్టంరాజు వారి వీధి, ఇందిరానగర్, అద్దంకి, బాపట్ల జిల్లా - 523 201. ఫోను : 81796 36617**

ప్రణయ హంపీకి శివేగారి దేవమ్మ నవలా పురస్కారం

6వ శివేగారి దేవమ్మ నవలా పురస్కారం 2024 సంవత్సరానికిగాను మారుతీ పౌరోహితం రచించిన ప్రణయ హంపీ నవల ఎంపికైంది. ఈ పోటీకి మొత్తం 29 నవలలు వచ్చాయి. న్యాయనిర్ణేతలుగా డా.వి.ఆర్. రాసాని, ప్రసేన్ బెల్లంకొండ వ్యవహరించారు. తిరుపతిలో త్వరలో జరగబోవు కార్యక్రమంలో రచయితకు రూ.10 వేల నగదుతో పాటు పురస్కార ప్రదానం జరుగుతుంది.

– కె.వి. మేఘనాథ్, అవార్డు వ్యవస్థాపకులు

బండికల్లు ఫౌండేషన్ కథల పోటీ

బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ జాతీయ స్థాయి కథల పోటీ నిర్వహిస్తోంది. కథ నిడివి చేతివ్రాతలో 5 పేజీలు, డిటిపిలో 4 పేజీలకు మించరాదు. రచయిత పేరు, చిరునామా, హామీపత్రంలో మాత్రమే వ్రాయాలి. కథల్లో కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలు, సామాజిక అంశాలు ప్రతిబింబించాలి. 6 కథలకు రూ. 2,500 చొప్పున నగదు బహుమతి ఉంటుంది. బహుమతి పొందిన కథలు విశాఖ సంస్కృతిలో ప్రచురింపబడతాయి. కథలను 25.8.2025 లోగా **బండికల్లు జమదగ్ని, ఫ్లాట్ నెంబరు 402, హిమజ టవర్స్, 3/10 బ్రాడీపేట, గుంటూరు - 522002 కు పంపాలి. ఈమెయిల్ :** bjmarkandeyulu@gmail.com

– బండికల్లు జమదగ్ని,
98482 64742

ఒక రాజకీయ తాత్విక సంవేదన

ప్రొఫెసర్ కేశవ్ కుమార్ రెండో కవితా సంపుటి 'ఎగిరే పళ్ళెం నడిచే మంచం ఓ కూనిరాగం'లో మనదేశ మల్టీప్లెక్స్ వాస్తవికతపై లోతైన అవగాహన, rebellious romantic నిరసన ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కవితా పంక్తులు Walt Whitman లాంటి వారిలో లావాలా, Emily Dickinson కవితలో అత్యంత సంక్షిప్తంగా ఉంటాయి. కేశవ్ కవిత్వంలో వాక్యాలు సెలయేరులా పరుగులు తీస్తాయి. ఈయన కవిత్వాన్ని నెమ్మదిగానే కాకుండా మళ్ళీ మళ్ళీ చదవాలి. లేకుంటే సమకాలీన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ విషయాలు, allusions ఎన్నో మిస్ అవుతాం. అంతే కాకుండా ఒకింత tediousగా అనిపించే ప్రమాదం ఉంది. ప్రతి పేజీలో కుల వ్యవస్థ అణచివేత, అంటరాని తనం, యంత్రస్వామ్య, పరాయీకరణాలపై విమర్శ, ఆత్మగౌరవ స్వరం, నిరంకుశత్వం, నయా వలసవాదాలపై నిర్విరామ దాడి గోచరిస్తాయి. ఈనాడు డిస్టోపియా అందర్నీ కలిచివేస్తున్నపుడు కవి కర్తవ్యం cynicism కాదు. ఈ భూగోళ భవిష్యత్తుపై ఆశను, కలల్ని తిరిగి బతికించడమే! ఫాసిజం జాడ్యానికి rebellious romanticism ఒక మందు. గతంలో జరిగిన హోలోకాస్ట్‌ను చూపి ఆ అభద్రతా భావన పునాదిపై నేడు ఇజ్రాయెల్ చేస్తున్న నరమేధానికి, ఇక్కడ బ్రిటీష్ సామ్రాజ్యవాద దోపిడీ ముందు జరిగిన మొగల్ దాడి, ముస్లిం రాజుల పాలన సాకుగా రాజ్యాంగ విలువలకు మంగళం పాడుతున్న మెజారిటీరియనిజానికి భావ సామ్యముంది. భావ ప్రకటనా స్వేచ్ఛా పావురంగొంతు కోస్తున్న authoritarianism ప్రజలను కలవరపెడుతోంది.

కొత్త భాష కోసం, శ్రమ సంస్కృతి ఆధిపత్యం కోసం కవి పడే తపన చైతన్యపూరితమైనది. స్టువర్ట్ హాల్ ప్రస్తావించినట్లు పాలక వర్గాలు అన్ని రంగాల్లో ఆధిపత్యం నిలబెట్టుకోవడం కోసం నిత్య సమరం చేస్తుంటాయి. దీనికి ప్రతిగా కేశవ్ కవిత్వం సైతం 'అనైతిక ప్రశ్నలు' సంధిస్తూ అన్ని వివక్షలు, అసమానతలపై తిరుగుబాటు కేతనం ఎత్తింది.

కులవ్యవస్థ మనిషి వ్యక్తిత్వాన్ని చంపి parasitismను పోషిస్తోంది. కార్పొరేటు వికృత మరుగుజ్జు రాజకీయం మహా మానుగా మారి, ద్వేషభక్తి చిందులు వేస్తుంటే, ప్రశ్న గుప్పెడు గింజలు ఇవ్వని ఎండుచెట్టులా మారితే, మారిన సిలబస్‌లో మాయమైన స్వీయాన్వేషణ గురించి 'అనర్హత' కవిత చెబుతుంది. 'అలసిన శరీరాల్ని/ సంగీతాక్షరాల్లో ముంచి తీయాలి/ వెలేసిన అక్షరాళ్ళోంచి వేడిని పుట్టించాలి' అంటాడు కవి 'అపరిచితుడు' కవితలో. పట్టణీకరణ, గ్లోబలైజేషన్ల ప్రభావంతో వూరు ఖాళీ అవుతుండటం, పల్లె తలెత్తినపుడల్లా జరిగే నరమేధం 'కేరాఫ్ మాలపల్లి' చూపుతుంది. నవ నాగరికతకు ఎదురుచూసే ఒంటరి వొంటి స్తంభం, నిత్య మోనార్క్‌లా మారిన 'మనువు గారి మనోగతం' ఊడలు దించిన మర్రి చెట్టులా నిలబడుతుంది.



కవి తన 'గేన గీత'లో అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ 'నువ్వెన్ని కర్మ గీతలు గీసినా/ నాగేటి గీతలో గేన గీత'గా నిలుస్తానంటాడు. కులం, మతం, దైవ భావన బంధాన్ని 'ష్! మాట్లాడండి' బయటపెడితే, అమలుకాని రాజ్యాంగాన్ని 'ఆత్మగౌరవ బొమ్మ' నిలదీస్తుంది. 'చీకటి వెన్నెల'లో కవి అంటాడు: "అక్షరాలకి అవతల ఇంకా మిగిలిపోయిన వేదన నాది/ నేను నిత్యం కాలుతున్న కడుపు మంటను/ చేతనైతే అక్షరాల్లేని భాషలో నన్ను హత్తుకో/ నేను మలాన్ని చేత్తో ఎత్తేసినట్టుగా.' 'నా ఇంటికి బండ గుర్తు అంబేద్కర్ బొమ్మ' దళితులు ఎలా ఊరికి పరాయిగా, జనాభా, ఓట్ల లెక్కల్లో తప్ప మరెక్కడో కానరారో చెబుతూ శ్రమ లేనిదే ఊరు లేదనే ప్రతిఘటనా స్వరం వినిపిస్తుంది.

ఇక 'ఆపదలో పుణ్య పురుషులు' కవిత రాయడం మనోభావాల పేరిట హేతువాద విమర్శను చంపే నేడు కత్తి మీద సాము లాంటిది. కవి దృష్టిలో 'అమరత్వం' అంటే జవమున్న వాక్యాలు, జానపదురాలి జాతర, ఆత్మగౌరవం. మనిషి అస్తిత్వానికి ఆధార్ సమస్తము అయిన వైనాన్ని ఖండిస్తూ 'నెంబర్ బిళ్ళ మెడకు తొడుక్కుని/ నిత్య నిఘా నీడలో నేను' ఈ నిరసన కవితా లోకంలో 'ఆకాశ పరుపు మీద నిదురోయే సూరీడు', 'నగరాన్ని చూసి నవ్వాపుకోలేని నక్షత్రాలు', 'పూలదండలతో ఊరేగుతున్న కత్తులు', 'అపౌరుషేయాలు' లాంటి అలంకారాలు ఉన్నాయి.

ఈ పుస్తకంలోని కవిత 'నిశ్శబ్ద నినాదం' ఆత్మ గౌరవమే ఈనాడు 'నేరమ'ని, 'దేశ ద్రోహం' అని తెలియక చీకటి గదిలో మగ్గిపోయే మిత్రుడి కోసం రాసింది. రాజనీతి, ప్రజాస్వామ్యరహిత సామ్రాజ్యనీతిపై నిరసన 'మహా సామ్రాజ్యం'. Authoritarianism సహించని విషయం ప్రశ్నించడం. కానీ, 'అడ్డగోలు అధికారానికి అడ్డంగా/ ప్రశ్న ఒక సామాజిక సంభాషణం/ ప్రశ్న ఒక సమాధానం/ ప్రశ్న చరిత్ర అస్తిత్వంగా' ఉంటుంది. 'ఆకలి పుస్తకంలో/ ఏ కోర్కెల పెన్నుతో రాసినా/ బ్లాంక్ పేపర్ గానే!' లాంటి వాక్యాలు కదిలిస్తాయి. ఇక 'డిస్టోపియా' అనే కవితలో 'విరగబడి పండిన కన్నీళ్ళు', 'బాధాస్పద బాధితుడు' లాంటి పద ప్రయోగాలు ఉన్నాయి. 'పరీక్షా ప్రశ్నలు' కవితలో ఓ సార్ ప్రజాస్వామ్యం పై పరీక్షలో ప్రశ్నకు జవాబివ్వలేక 'పరీక్ష నా బతుక్కో ప్రజాస్వామ్యానికో/ తెలియని తికమకలో ఫెయిల్ అవుతూ' చదువుతుంటే మన పెదాలపై ఎండిన చిరు దరహాసం విరుస్తుంది. నేరస్తులను మర్యాదస్తులుగా ముందే ప్రభుత్వం వదిలిపెడితే న్యాయం కోసం పోరాడిన తీస్తా సెతలవాడ్ కోసం రాసిన కవిత 'అబద్ధపు సాక్ష్యం.' ఈ అబద్ధ సాక్ష్య జగత్తులో ఏ దైవాధికారం ఆపలేని 'దాచుకున్న కన్నీళ్లను/ కవిత్వంగా పొంగి పొర్లనీయండి/ ఆశావృక్షాలు ఆకాశమంతా పరుచుకునేలా!' మరో కవిత 'అనైతిక ప్రశ్నలు' అసమానతలను ప్రశ్నిస్తూ ఉండే శైలి పాఠకుడితో ఒక స్నేహితుడిలా సంభాషిస్తున్నట్లు ఉంటుంది. పుస్తకం టైటిల్ పేరున్న కవితలో అందని ఆకలి పళ్లెం, మార్పు గురించి ఆగని ఈర బ్రహ్మం కూనిరాగం ప్రస్తావన ఉంది.

ఇక రొమాంటిసిజం కూడా ఈ సంపుటిలో బలంగా ఉంది. ఇది ప్రకృతిపరంగా, సామాజిక మార్పు పరంగా వ్యక్తం అయింది. మొదటి కవిత 'ఎగరని సీతాకోక చిలుకలు'లో 'ఎన్ని ఆశల సీతాకోకచిలుకలు/ ఎగరకుండా నేల కరుచుకుని/ రాయకుండానే పూర్తయిన వాక్యం'. 'మాసూళ్ళు సందడి' కవితలో కీట్స్‌ను తలపించే వర్ణన ఉంది. పల్లె జ్ఞాపకాలు, ప్రకృతి, జీవరాశులుతో మమేకత్వం పుష్కలంగా కనిపిస్తుంది. దీనికి నిదర్శనంగా ఈ పంక్తులు : 'ఆకుపచ్చని మంచు తివాచీలా పరిచిన మినుప చేలల్లో/ వళ్ళంతా పసుపు పలకరించిన ఆవాలు పూసుకుని/ పురాతన గుడిలా కుప్ప పోసుకున్న ధాన్య దేవత వడిలో 'మరియు చలిని చీలుస్తూ సాగే మాసూళ్ళు/ బంతి తిప్పుతూ కాళ్ళ నెప్పులతో/ అలిసిపోయి ఆగిన ఆవుదూడలా నేను" అనే పంక్తులు మనల్ని అలరిస్తాయి. 'సూర్యుడు కనిపించాడా' కవితలో మేఘాల్ని విత్తనాలుగా, చందమామను గోరు ముద్దలుగా, తారలని నోటిలో కరుచుకున్న పిట్టలు లాంటి imagery ఉంది. చిట్ట చివరి దీర్ఘ కవిత 'వలస పలుకులు' లో వలసవాదం గత, కొత్త రూపాలను ఎండగట్టారు. సత్యం స్వేచ్ఛను ఇస్తుందని చెప్పే కవి భావి చరిత్ర అనేది 'సామ్రాజ్య రోబోల మేధస్సు మీదెక్కి చిందులేసే/ మట్టి మనుషుల మహా మానవ రాజ్యమేలే' అని ముగిస్తాడు. నల్లజాతి యువకులను గురించి స్టువర్ట్ హాల్ ఇలా అన్నాడు : They have a sense of themselves in the world; they have a pride of their place; they have a capacity to resist ; they know when they are abused by dominant culture ; and they have begun to know how to hold it at bay. But above all, they have a sense of some other person that they really are. They have become visible to themselves. ఈ వాక్యాలు దళిత ఆత్మ గౌరవస్వరం నిర్విరామంగా వినిపించిన తాత్విక కవి కేశవ్ కుమార్ కవితలు. Foucault ఇలా ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు : The displacement and transformation of frameworks of thinking, the changing of received values and all the work that has been done to think otherwise, to do something else, to become other than what one is that, too, is philosophy. ఈ మాటలు కేశవ్ కుమార్ తాత్విక కవిత్వానికి సరిగ్గా సరిపోతాయి.

– డా. జె.రవీంద్రనాథ్
89781 31585

కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే ఇఎల్ఐ

- అసంఘటిత రంగాన్ని విస్మరించింది అందుకే
- కార్మిక సంఘాల విమర్శ

న్యూఢిల్లీ : భారత్‌లో ఉద్యోగాలు లేకపోవటంతో కోట్లాది మంది యువతీ, యువకులు ఖాళీగా ఉంటున్నారు. ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యపూరిత చర్యల కారణంగా దేశంలో నిరుద్యోగం తీవ్రంగా ఉన్నది. అయితే ఈ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి అని చెబుతూ రూ.99,446 కోట్ల విలువైన ఎంప్లాయిమెంట్-లింక్డ్ ఇన్సెంటివ్ (ఇఎల్ఐ) పథకాన్ని గత నెల 1న కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. ఈ నెల 1 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. వచ్చే రెండేళ్లలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలను సృష్టించడం ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. ఇంత భారీ లక్ష్యంతో అధిక మొత్తంలో నిధులతో ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకం తీరుపై పలు కార్మిక సంఘాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగ కల్పన పేరుతో యాజమాన్యాలైన కార్పొరేట్ కంపెనీలకు ఆర్థికంగా లబ్దిని చేకూర్చేందుకే ఇఎల్ఐ తీసుకొచ్చారని విమర్శిస్తున్నాయి. ఇపిఎఫ్ఒను లింక్ చేస్తూ ఉండే ఈ పథకం కింద అసంఘటిత రంగంలోని ఉద్యోగులను, కార్మికులను విస్మరించటం ఏ మాత్రమూ సరికాదని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. దీనిని బట్టే ఈ పథకాన్ని ఎవ్వరి కోసం తీసుకొచ్చారో అర్థం చేసుకోవచ్చునని విశ్లేషిస్తున్నాయి.

ఇఎల్ఐ పథకాన్ని గతంలో రూ.1.46 లక్షల కోట్లతో తీసుకొచ్చిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్ఐ), రూ.76 వేల కోట్ల విలువైన క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ ఇన్సెంటివ్ (క్యాపెక్స్) పథకాల ఆధారంగా రూపొందించారు. పిఎల్ఐ, క్యాపెక్స్ పథకాల ప్రారంభంలోనూ ఉపాధి వృద్ధినే లక్ష్యంగా చెప్పారు. భారీ మొత్తంలో నిధులను ఖర్చు చేశారు..కానీ ఆ నిధులు ఎక్కడికి వెళ్లావో..ఎంతమందికి ఉపాధి దక్కిందో చెప్పే గణాంకాల్లేవు. ప్రజాధనం మాత్రం కార్పొరేట్ కంపెనీల ఖజానాకు తరలిపోయింది. ఇప్పుడు ఇఎల్ఐ పథకం కూడా ఇదే తరహా రూపొందించారని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నోడల్ ఏజెన్సీగా ఇపిఎఫ్ఒ

ఇఎల్ఐ పథకం కింద.. అనేక మందికి ఉద్యోగాలను కల్పించేలా ప్రోత్సహించటం కోసం కంపెనీలకు లేబర్ కాస్ట్‌లను (ఇన్సెంటివ్‌లు) చెల్లిస్తారు. ఈ లెక్కన ఇపిఎఫ్ఓ కింద రిజిస్టరైన ఎంప్లాయర్లు.. నెలకు ప్రతి ఉద్యోగి చొప్పున రూ.వెయ్యి నుంచి రూ.3000 వరకు ఇన్సెంటివ్‌ను పొందుతారు. ఇది ఉద్యోగికి ఇచ్చే జీతం ఆధారంగా ఉంటుంది. ఇలా ఇది రెండేళ్ల వరకు అందుతుంది. అయితే ఈ పథకంలో భాగంగా ఇపిఎఫ్ఒను నోడల్ ఏజెన్సీగా ఉపయోగించటంపై ఆందోళనలు తలెత్తుతున్నాయి. కార్మికులు, ఉద్యోగుల రిటైర్మెంట్ సేవింగ్స్ వ్యవహారాలను చూసే ఇపిఎఫ్ఓ.. ఇప్పుడు దాని స్వరూపాన్ని మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్మిక సంఘాలు అంటున్నాయి. కార్మికుల ప్రయోజనాలను కాపాడే సంస్థ నుంచి ఎంప్లాయర్లకు మూలధనాన్ని అందించే సంస్థగా మారుతోందన్న ఆందోళనలు తలెత్తుతున్నాయి.

ఈ పథకం రిజిస్టర్డ్ కంపెనీలకు వర్తిస్తుండటం, సూక్ష్మ, చిన్న, అసంఘటిత రంగంలోని సంస్థలను మినహాయిస్తుండటం పట్ల విమర్శలూ వస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ సంస్థలే అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలను సృష్టిస్తాయనీ, వాటిని ఈ స్కీం కిందకు తీసుకురాకపోవటం ఆందోళనకరమని అంటున్నారు. అలాగే, 20 కంటే తక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలకు ఈ స్కీం వర్తించకపోవటం పట్ల కార్మిక సంఘాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.



అగరుబత్తీల తయారీ, మైనపు ఒత్తుల తయారీ వంటి చిన్నచిన్న కుటీర పరిశ్రమలకు ఇఎల్ఐ పథకం వర్తించదు. అందువల్లే ఈ పథకం కేవలం కార్పొరేట్ కంపెనీలకు ప్రజల సొమ్మును తరలించే పథకంగా కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.

లక్ష్యాలు నెరవేరని పిఎల్ఐ, క్యాపెక్స్

పిఎల్ఐ స్కీమ్‌ను 2020లో ప్రారంభించారు. మొత్తం 14 తయారీ రంగాల్లో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించటానికి దీనిని తీసుకొచ్చారు. ఆ తర్వాత దానిని 17 రంగాలకు విస్తరించారు. 60 లక్షల ఉద్యోగాలను సృష్టించటం, జిడిపిలో ఉత్పత్తి రంగం వాటాను 15.4 శాతం నుంచి 25 శాతానికి పెంచాల పీఎల్ఐ స్కీం కింద లక్ష్యంగా నిర్దేశించారు. అయితే ఐదేండ్లలో ఏడు లక్షల ఉద్యోగాలు మాత్రం సృష్టించబడటం గమనార్హం. ఇక జిడిపిలో ఈ రంగం వాటా 14.2 శాతానికి పడిపోయింది. క్యాపెక్స్ స్కీం కూడా అనేక విమర్శలను ఎదుర్కొన్నది. ఈ స్కీం కింద బడా కంపెనీలు, కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీ రూపంలో పెద్ద ఎత్తున నిధులు వెళ్లాయన్నది ఆరోపణ. ఉదాహరణకు.. ప్రతీ ఒక్క ఉద్యోగాన్ని సృష్టించేందుకు గుజరాత్‌లోని సనన్డ్ ఇండస్ట్రీయల్ హబ్‌కు రూ.3.25 కోట్లు తరలివెళ్లటం గమనార్హం. ఇలాగే భారత్‌తో పాటు విదేశాలకు చెందిన ఇతర కంపెనీలు, సంస్థలకు ఈ స్కీం కింద పెద్ద ఎత్తున నిధులు అందినట్టు తెలిసింది. ఈ పథకాలు ఉద్యోగాలను సృష్టించటం కంటే దేశ, విదేశాలకు చెందిన బడా కంపెనీలకు ఆర్థిక వనరుగా మారాయి. ఈ పథకాలకు అందే నిధులు దేశంలోని సాధారణ ప్రజల నుంచి పన్నుల ద్వారా వచ్చేవేననీ, ముఖ్యంగా జీఎస్టీ వసూళ్ల నుంచి అని విశ్లేషకులు చెప్తున్నారు.

సామాజిక భద్రతకు విఘాతం : తపన్‌సేన్



ఈ పథకం తప్పుదోవ పడుతున్నదనీ, ఇది ప్రజాధనాన్ని ప్రయివేటు యాజమాన్యాలకు తరలించే చర్య అని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ప్రధానకార్యదర్శి తపన్ సేన్ విమర్శించారు. పిఎల్ఐ, క్యాపెక్స్ కింద గతంలో లభించిన ఉద్యోగాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇవ్వాలన్న ట్రేడ్ యూనియన్ల పిలుపును ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆయన గుర్తు చేశారు. ఇఎల్ఐతో యాజమాన్యాలకు సబ్సిడీ అందుతుందనీ, కార్మికులు, ఉద్యోగుల పట్ల భారాన్ని మోపుతూ సామాజిక భద్రతను నీరుగారుస్తుందని తపన్ సేన్ ఆందోళనను వ్యక్తం చేశారు.

ఆ కార్డు అప్పగించండి.. దర్యాప్తు చేయాలి

- ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్‌కు ఎన్నికల సంఘం నోటీసులు



పాట్నా : బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టిన తర్వాత ప్రకటించిన ముసాయిదాలో తన పేరు కనిపించలేదంటూ ఆర్‌జెడి నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ చేసిన ప్రకటనపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. ఈ ప్రకటన చేసే సమయంలో ఆయన చూపించిన ఓటరు కార్డు అధికారికంగా జారీ చేసింది కాదదంటూ తేజస్వీ యాదవ్‌కు ఎన్నికల సంఘం నోటీసులు పంపింది. 'ఆగస్టు 2న పాట్నాలో మీడియా సమావేశంలో తేజస్వీయాదవ్ చూపించిన గుర్తింపు కార్డు అధికారికంగా జారీ చేసినది కాదు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసేందుకు ఆ కార్డును అప్పగించాలని కోరుతున్నాం' అని ఇసి తన నోటీసుల్లో పేర్కొంది. కాగా తన ఓటరు కార్డు నంబరు మార్చారని తేజస్వీ చేసిన వాదనను కూడా జిల్లా కలెక్టరు తిరస్కరించారు. 2020 శాసనసభ ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌లో తేజస్వీ పేర్కొన్న ఓటరు గుర్తింపు నంబరు కూడా ఇదేనని తెలిపారు. ఇటీవల ఎస్ఐఆర్ జాబితాలో తన గుర్తింపు కార్డు నంబరు కనిపించలేదని, రాష్ట్రంలో 65 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారని తేజస్వీ యాదవ్ ఈ నెల 2న మీడియా సమావేశంలో విమర్శించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఇసి.. అవి నిరాధారమని పేర్కొంది. ముసాయిదా జాబితాలో 416 క్రమ సంఖ్య వద్ద తేజస్వి పేరు ఉందని, ఆయన చెప్పిన కార్డు ఫోర్జరీ చేశారా? అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది. ఈ క్రమంలోనే ఆ కార్డును తమకు అప్పగించాలంటూ తాజాగా లేఖ రాసింది.

స్పైస్‌జెట్ సిబ్బందిపై ఆర్మీ అధికారి దాడి

శ్రీనగర్ : లగేజీకి అదనపు ఛార్జీ చెల్లించాలన్న స్పైస్ జెట్ ఉద్యోగులపై ఆర్మీ అధికారి ఒకరు విచక్షణారహితంగా దాడి చేశారు. గతవారం శ్రీనగర్ విమానాశ్రయంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీనియర్ ఆర్మీ అధికారి 16 కిలోల బరువు కలిగిన రెండు క్యాబిన్ లగేజీలు తీసుకువెళున్నాడు. సాధారణంగా 7 కిలోల వరకు విమానంలోకి అనుమతిస్తారు. అదనపు ఛార్జీ చెల్లించాల్సి వుందని స్పైస్ జెట్ సిబ్బంది తెలిపారు. అతను నిరాకరించి, బోర్డింగ్ పూర్తికాకుండానే ఏరోబ్రిడ్జిలోకి ప్రవేశించడంతో సిబ్బంది అతన్ని అడ్డుకుని తిరిగి గేటు వైపు తీసుకువెళ్లాడు. ఆగ్రహించిన ఆర్మీ అధికారి గ్రౌండ్ సిబ్బందిపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఒక ఉద్యోగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మూర్ఛపోయిన సహోద్యోగికి సాయం అందించేందుకు యత్నిస్తున్న మరో ఉద్యోగిని బలంగా తన్నడంతో అతని ముక్కు, దవడకు గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు స్పైస్ జెట్ ప్రతినిధి తెలిపారు. ఆర్మీ అధికారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అన్నారు. ఆ అధికారిని నో ఫ్లై జోన్‌లో చేర్చనున్నామని అన్నారు. ఆర్మీ అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని పౌర విమానయాన మంత్రికి లేఖ రాసినట్లు ఎయిర్‌లైన్స్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

గ్రానైట్ క్వారీలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలకు, గాయపడిన వారికి జిల్లా కలెక్టర్ పరిహారం ప్రకటించారు. ఈ ప్రమాదంపై న్యాయ విచారణ జరపాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆదివారం జరిగిన ఈ ఘోరప్రమాదానికి సంబంధించి తోటి కార్మికుల కథనం ప్రకారం... రోజూ మాదిరిగానే గ్రానైట్ క్వారీలో పనికి వెళ్లిన కార్మికులు అక్కడ ఉన్న గ్రానైట్ రాళ్లను కటింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో గ్రానైట్ రాళ్లు పైనుంచి విరిగి కింద పనిచేస్తున్న కార్మికులపై పడ్డాయి. దీంతో, నలుగురు అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన పది మందిని నర్సరావుపేట వైద్యశాలకు తరలించగా, అక్కడ ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మృతుల్లో దండ బడత్య (48), టకున దలాయ్ (37), బనమల బెహరా (30), భాస్కర్ భిషోయ్ (40), సంతోష్ గౌడ్ (36), ముస్సాజన (43) ఉన్నారు. వీరంతా ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన వారు. తీవ్రంగా గాయడిన వారిలో ఎ.సుదర్శన్, అలక్ నాయక్, సిరా గౌడ, ఎస్.వెంకయ్య, ఎల్ సుభాష్ మాలిక్, పవిత్ర బెహ్రా, శాంత నాయక్, దంబా ఉన్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాద సమయంలో క్వారీలో మొత్తం 16 మంది పనిచేస్తున్నారు.

విచారణకు సిఎం చంద్రబాబు ఆదేశం

క్వారీలో ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం, మరికొందరు గాయపడడంపై రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఈ సంఘటనపై విచారణ చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్వారీ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. క్వారీ ప్రమాదంలో ఆరుగురు మరణించడం అత్యంత బాధాకరమని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ తరహా ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు రవాణా శాఖ మంత్రి మండపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి సూచించారు.

మృతుల కుటుంబాలకు రూ.14 లక్షల చొప్పున పరిహారం : కలెక్టర్

నర్సరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ జె.వెంకటమురళి పరామర్శించారు. శనివారం కురిసిన వర్షం కారణంగా క్వారీలో ఉన్న మట్టి కదలడంతో గ్రానైట్ బండలు కిందికి జారి పడ్డాయని ప్రాథమిక నివేదికలో తేలిందని తెలిపారు. ఈ ప్రమాదం విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తనతో మాట్లాడారని చెప్పారు. మృతుల కుటుంబాలకు సిఎం ఆదేశాల మేరకు రూ.14 లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్మికుల మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు కార్మికులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామన్నారు. స్వల్ప గాయాలైన వారికి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఘటనపై ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సమగ్ర విచారణ జరుగుతుందని, జరిగిన ప్రమాద సంఘటనపై రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులతో సమీక్షిస్తున్నట్లు చెప్పారు. క్వారీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఘటనాస్థలాన్ని జిల్లా ఎస్‌పి తుషార్ డూడి పరిశీలించారు. ప్రమాదం జరగడానికి దారితీసిన అంశాలపై పరిశీలించారు.

ప్రమాదకరమైన క్వారీలను మూసివేయాలి : రమాదేవి

అద్దంకిలో ప్రభుత్వాస్పత్రిలో ఉన్న కార్మికుల మృతదేహాలను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను గౌరవప్రదంగా వారి కుటుంబసభ్యులకు అందజేయాలని కోరారు. ప్రమాదకరమైన క్వారీలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు.

యుపిలో ఘోర ప్రమాదం

- బొలెరో వాహనం కాలువలోకి బోల్తా పడి 11 మంది మృతి
- మరో నలుగురికి గాయాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని గొండా జిల్లా బెల్వా బహుటా సమీపాన ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకున్నది. స్థానిక పృథ్వీనాథ్ ఆలయానికి యాత్రికులను తీసుకెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి కాలువలో బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సిహాగావ్ గ్రామం నుంచి ఖర్గుపుర్‌లోని పథ్వీనాథ్ ఆలయంలో పవిత్ర జలం సమర్పించేందుకు 15 మంది కలిసి బొలెరోలో బయలుదేరారు. మార్గం మధ్యలో కారు అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది. దీంతో 11 మంది మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్‌తో సహా నలుగురుని రక్షించినట్లు ఎస్‌పి వినీత్ జైస్వాల్ తెలిపారు. కారులోనే చనిపోయిన 11 మంది మతదేహాలను వెలికితీసి, శవపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మతుల్లో ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. అయితే వర్షం కారణంగా రోడ్లు తడిసిపోవడంతో టైర్లు జారడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ప్రధాని మోడీ సంతాపం

ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. మతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున అందిస్తామని చెప్పారు.

జెడి(యు)లో చేరిన బీహార్ సీనియర్ కాంగ్రెస్ నేత

పాట్నా : బీహార్‌లో సీనియర్ కాంగ్రెస్ నేత అశోక్ కుమార్ (రామ్) ఆదివారం అధికార పార్టీ జెడి(యు)లో చేరారు. సమస్తీపూర్ జిల్లాలోని రోసెరా అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సభ్యుడిగా కూడా ఉన్నారు. చాలా కాలంగా పార్టీలో సీనియర్ దళిత నేతగా గుర్తింపు పొందారు. అశోక్ రామ్ తండ్రి బాలేశ్వర్ రామ్ కూడా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈ నెల 10వ తేదీ నుండి రాష్ట్రంలోని 18 జిల్లాల్లో పాదయాత్ర చేపట్టనున్నట్లు సమాచారం. అదే సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

రష్యాలో బద్దలైన అగ్ని పర్వతం :

- 600 ఏళ్లలో మొదటిసారి

మాస్కో : రష్యాలోని కమ్చట్కాలోని క్రాషెనిన్నికోవ్ అగ్ని పర్వతం శనివారం రాత్రి బద్దలైంది. 600 ఏళ్లలో మొదటిసారి అగ్ని పర్వతం విస్ఫోటనం చెందినట్లు కమ్చట్కా అగ్నిపర్వత విస్ఫోటన ప్రతిస్పందన బృందం అధ్యక్షులు ఓల్గా గిరినా పేర్కొన్నారు. గత బుధవారం సంభవించిన భూకంపం ఈ విస్ఫోటనానికి కారణమై ఉండవచ్చని అన్నారు. దీంతో ఫ్రెంచ్‌పాలినేషియా, చిలీ వరకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయని, ఆ తర్వాత కమ్చట్కాలో అత్యంత చురుకైన క్రాషెనిన్నికోవ్ అగ్ని పర్వతం బద్దలైందని అన్నారు. అగ్నిపర్వతం విస్ఫోటనం తర్వాత 6,000 మీటర్లు (3.7మైళ్లు) ఎత్తుకు బూడిద పొగమంచులా ఎగిసిపడుతున్నట్లు రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ తెలిపింది.బూడిత తూర్పు దిశగా పసిఫిక్ మహాసముద్రం వైపుగా వెళ్లిందని, ఈ ప్రాంతంలో జనసాంద్రత ఉన్న ప్రాంతాలు లేవని అన్నారు. ఈ అగ్ని పర్వతం 1,856మీటర్ల ఎత్తులో ఉంది. 1463లో (40 ఏళ్లు అటు ఇటుగా) ఈ అగ్ని పర్వతం బద్దలైందని అన్నారు.

7న ఇండియా బ్లాక్ నేతల భేటీ

- ఎస్ఐఆర్, ట్రంప్ సుంకాలపై చర్చ
- రాహుల్ నివాసంలో సమావేశం

న్యూఢిల్లీ : ప్రతిపక్షాల వేదిక 'ఇండియా బ్లాక్' పార్టీల నేతలు ఈ నెల 7వ తేదీ గురువారం సమావేశం కానున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాసంలో ఈ భేటీ జరగనున్నట్లు సమాచారం. అయితే అదే రోజు రాత్రి బ్లాక్ నేతలకు రాహుల్ విందు ఏర్పాటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. గత సార్వత్రిక ఎన్నికల్లో 70 నుంచి 80 లోక్‌సభ స్థానాల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఇండియా బ్లాక్ నేతల సమావేశం కానుండటం ఆసక్తి రేపుతోంది.

బీహార్‌లో ప్రస్తుతం ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, మహారాష్ట్ర ఓటరు జాబితాలపై విమర్శలు, ఆపరేషన్ సిందూర్, భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందం, భారత్‌పై అమెరికా అధ్యక్షులు ట్రంప్ విధించిన సుంకాలు, చేసిన ప్రకటనలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనం దాల్చడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. తాను తప్పకుండా ఆగస్టు 7న జరిగే ఇండియా కూటమి సమావేశానికి హాజరవుతానని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నేత ఫరూఖ్ అబ్దుల్లా శనివారం రోజే వెల్లడించారు. బీహార్‌లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి-జెడియు కూటమిని గెలిపించేందుకే ఎస్ఐఆర్ చేపట్టారని ఆయన విమర్శించారు. బీహార్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న వాళ్లనే తిరిగి గెలిపించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తనకు కూడా రాహుల్ గాంధీ నుంచి పిలుపు వచ్చిందని, ఆగస్టు 7న జరిగే సమావేశానికి హాజరవుతానని సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి రాజా చెప్పారు. సమావేశ ఎజెండా ఏమిటనేది ఇంకా తెలియదన్నారు. త్వరలోనే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

ఇసి సమాధానాలు చెప్పాల్సిందే : ప్రియాంకా చతుర్వేది

బీహార్‌లో ఓటర్ల తొలగింపు, మహారాష్ట్రలో లక్షలాది ఓటర్ల చేరికతో ముడిపడిన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సమాధానాలు రావాల్సి ఉందని శివసేన (ఉద్ధవ్) నాయకురాలు ప్రియాంకా చతుర్వేది అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగే సమయంలో 45 లక్షల మంది ఓటర్లను ఎలా చేర్చారు? చివరి గంటలో ఓటరు జాబితాల నుంచి 70 లక్షల మంది ఓటర్లను ఎలా తొలగించారు? అనే ప్రశ్నలకు ఇసి సమాధానం చెప్పాలని ఆమె కోరారు. ఈ అంశాలను ఆగస్టు 7న రాహుల్ గాంధీ నివాసంలో జరిగే భేటీలో ప్రస్తావిస్తామని ఆమె అన్నారు. బీహార్‌లో ఓటరు జాబితాల నుంచి ఓటర్ల పేర్లను ఎందుకు తొలగిస్తున్నారు? వలస కూలీల ఓట్లకు ఎందుకు ఎసరు పెడుతున్నారు? అనే అంశాలపై క్లారిటీ రావాల్సి ఉందని ప్రియాంకా చతుర్వేది చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి సహా ఏ అంశంపైనా జవాబుదారీగా పార్లమెంటుకు బదులిచ్చేందుకు కేంద్ర హోంశాఖ సిద్ధపడటం లేదన్నారు. భారత ప్రజల రక్తాన్ని పణంగా పెట్టి, కేవలం డబ్బుల కోసం పాకిస్థాన్‌తో టీమిండియా క్రికెట్ మ్యాచ్‌లకు మోదీ అనుమతించడం దారుణమని ఆమె పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ వల్ల చోటుచేసుకున్న రక్తపాతాన్ని మరువరాదన్నారు.

రెండోసారి భేటీ

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి ఇండియా బ్లాక్ నేతలు భేటీ కానుండటం ఇది రెండోసారి. జులై 19న జరిగిన వర్చువల్ సమావేశంలో దాదాపు 24 మంది నాయకులు పాల్గొన్నారు. హాజరైన నేతల్లో శరద్ పవార్ (ఎన్‌సిపి – ఎస్‌పి), తేజస్వి యాదవ్ (ఆర్‌జెడి), జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తదితరులు ఉన్నారు.

జపాన్ సముద్రంలో చైనా, రష్యా నావికా విన్యాసాలు

బీజింగ్ : జపాన్ సముద్రంలో చైనా, రష్యాలు ఉమ్మడి నావికా విన్యాసాలను ప్రారంభించాయి. 'జాయింట్ సీ -2025' విన్యాసాలు రష్యాలోని వ్లాడివోస్టాక్ ఓడరేవు సమీపంలోని జలాల్లో ప్రారంభమై మూడు రోజుల పాటు కొనసాగుతాయని చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇరువైపులా జలాంతర్గామి రక్షణ, ఉమ్మడి జలాంతర్గామి వ్యతిరేక, వైమానిక రక్షణ మరియు క్షిపణి వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగుతాయని పేర్కొంది. గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్స్ మరియు ఉరుంకితో సహా నాలుగు చైనా నౌకలు రష్యన్ నౌకలతో పాటు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.ఈ విన్యాసాలు రెండు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయని పేర్కొంది. ఈ విన్యాసాల అనంతరం, రెండు దేశాలు పసిఫిక్ సంబంధిత జలాల్లో నావికా గస్తీని నిర్వహిస్తాయని తెలిపింది. చైనా మరియు రష్యాల మధ్య జాయింట్ సీ విన్యాసాలు 2021లో ప్రారంభమయ్యాయి. గతేడాది ఈ విన్యాసాలు చైనా దక్షిణ తీరం వెంబడి జరిగాయి. ఆర్థిక మరియు రాజకీయ సంబంధాలతో పాటు, రష్యా మరియు బీజింగ్‌లు ఇటీవలి సంవత్సరాలలో తమ సైనిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకున్నాయి.


అమెరికా మార్కెట్‌లో భారత రొయ్యకు సవాలు

- ఎగుమతులు 7-9% తగ్గే అవకాశం
- వెల్లడించిన క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్



న్యూ ఢిల్లీ : ట్రంప్ విధించిన సుంకాలు అమల్లోకి రావడంతో భారత రొయ్యల పరిశ్రమ అమెరికా మార్కెట్‌లో పెను సవాళ్లను ఎదుర్కోనుంది..ఎగుమతుల్లో 7-9% తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ సంస్థ సీనియర్ డైరెక్టర్ రాహుల్ గుహ ఆదివారం వెల్లడించారు. కొత్త సుకాంలతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు.

అమెరికా మార్కెట్‌లో భారత రొయ్యల ఎగుమతులు సుమారు 48% వాటాను కలిగి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ॥60,523.89 కోట్ల విలువైన 17,81,602 మెట్రిక్ టన్నుల సీఫుడ్స్‌ను ఎగుమతి చేసింది. అయితే కొత్త సుంకాలు, ఇప్పటికే ఉన్న వాటితో కలుపుకుంటే మిగతా దేశాలకన్నా భారత్‌పైనే సుంకాలు అత్యదికం. ప్రపంచంలో రొయ్యల ఎగుమతి చేసే దేశాల్లో ఈక్విడార్ అగ్రస్థానంలో ఉంది. ఆదేశంపై అమెరికా విధించిన సుంకం కేవలం 10% మాత్రమే. దీనికి కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ పన్ను కలుపుకున్నా నామమాత్రమే. దీంతో ఆదేశ రొయ్యలు చాలా తక్కువ ధరలకు లభించనున్నాయి. ఈక్విడార్‌తో పోటీ కారణంగా భారత్ పై విధించిన 25% సుంకాలు, కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ (సివిడి-5.77%), యాంటీ డంపింగ్ డ్యూటీ (ఎడిడి-3.88%)తో కలుపుకుని ధరలు భారీగా పెరగనున్నాయని. దీని ప్రభావం భారత మార్కెట్‌పై గణనీయంగా ఉంటుందని, ఆదాయం 50-100 బేసిక్ పాయింట్లు తగ్గనుందని రాహుల్ వివరించారు. మరోవైపు మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలెప్‌మెంట్ అథారటీ (ఎంపిఇడిఎ), వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖలు రొయ్యల ఎగుమతుల పెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు ఆశాజనకంగా లేవు. ఏప్రెల్ నెలలో ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తునట్లు ప్రకటించిన ఏపి ప్రాన్ ప్రొడ్యూసర్స్ కంపెని (ఎపిపిపిసి) అతీగతీ లేదు. ఆంధ్రాలో దాదాపు 1.5 లక్షల రైతులున్నారు. ఆక్వా అనుభంద పరిశ్రమల్లో లక్షలాది మంది ఉపాధి పోందుతున్నారు. ప్రభుత్వం ఉత్పత్తి , ఉత్పాదకతతో పాటు ప్రత్యామ్నాయ మార్కెట్‌లను చూపాలని. రైతులకు నష్టాలను తగ్గించేందుకు ప్రోత్సాహకాలు ప్రకటించాలని, వేల కోట్ల టర్నోవర్ కలిగిన ఆక్వా పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు..



వివిఎస్ అచ్యుతానందన్ సంస్మరణ సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న బివి రాఘవులు చిత్రంలో వైవి, వి శ్రీనివాసరావు, రామకృష్ణ, మధు

ప్రజల మనిషి

(మొదటి పేజీ తరువాయి)

పొడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ వైఖరి చూస్తుంటే బ్రిటీష్ వాళ్లు దేశంలోకి మళ్లీ వస్తున్నారా అనే పరిస్థితి నెలకొందన్నారు. బీహార్‌లో 65 లక్షల ఓటర్లను తీసేశారని, ఇదే పరిస్థితి అన్ని రాష్ట్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. విఎస్ లాంటి వ్యక్తిత్వం కలిగిన వాళ్లు ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం అని ఆకాంక్షించారు. ఆయన చూపిన పోరాటం, తెగువ, త్యాగం, స్ఫూర్తి ఒరవడిని రాజీలేకుండా ఉద్యమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలా అయితేనే దేశాన్ని, ప్రజలను రక్షించుకోవాలని చెప్పారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. విఎస్ నిండు నూరేళ్లు కమ్యూనిస్టు జీవితం గడిపారని చెప్పారు. ప్రతిపక్షంలో కంటే అధికారంలోనే పోరాటం నిర్వహించి ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేరళలో స్థానిక సంస్థలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, కిందిస్థాయి వరకూ క్రియాశీలకంగా పాత్ర పోషించే పరిస్థితి ఉందన్నారు. ప్రజాస్వామ్యం, సెక్యులర్ భావాలను కాపాడుకునేందుకు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 100 శాతం అక్షరాస్యత ఉన్న కేరళను పెద్దగా చదువుకోలేకపోయినా విఎస్ ప్రభావితం చేయడం అంతుచిక్కని ప్రశ్న అని తెలిపారు. గర్వకారణమైన చరిత్ర కలిగిన నాయకుడు అని నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు పి మధు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను, వర్గ సిద్ధాంతాన్ని గొప్పగా అమలు జరిపిన వ్యక్తి అచ్యుతానందన్ అని అన్నారు. దానికి పునరంకితం కావడమే తమ కర్తవ్యమని చెప్పారు. వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విఎస్ ప్రజాహిత యోధుడు అని అన్నారు. ప్రజా పోరాటాలు, ప్రజా సమస్యల్లో పీపుల్స్ యూనివర్సిటీలో పిహెచ్‌డి చేశారని తెలిపారు. జీవితాంతం ప్రజల కోసం, అవినీతికి వ్యతిరేకంగా, పార్టీ విస్తరణకు, కొత్త సమాజాన్ని నిర్మించేందుకు పోరాటం చేశారని చెప్పారు. అతిథులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు వేదికపై ఆహ్వానించగా, రాష్ట్ర కమిటీ సభ్యులు డి కాశీనాథ్ వందన సమర్పణ చేశారు. విఎస్ అచ్యుతానందన్ సంస్మరణ సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను బివి రాఘవులు ఆవిష్కరించారు. అంతకుముందు ప్రజా నాట్యమండలి కళాకారులు గేయాలను ఆలపించారు.

పెరిగిన మద్యం అమ్మకాలు

- మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మద్యం అమ్మకాలు పెరిగాయని సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నాణ్యమైన మద్యం దొరకడంతో పక్క రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి దొంగచాటుగా మద్యం తీసుకొచ్చే పరిస్థితులు పోయాయని చెప్పారు. తక్కువ ధరలోనే నాణ్యమైన బ్రాండ్‌లతో పాటు విదేశీ బ్రాండ్‌లు దొరుకుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పిచ్చి బ్రాండ్లను ప్రజలకు అమ్మి దోచుకున్నారని విమర్శించారు. మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారని, దోచుకున్న డబ్బును విదేశాలకు తరలించారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో కల్తీ బ్రాండ్‌ల మద్యం తాగి దాదాపు 30 వేల మందికిపైగా మరణించారని సర్వేలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం చూసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో ఫ్రస్టేషన్ పెరిగిపోతుందన్నారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వాలను ఘాటుగా విమర్శించినా.. ఎక్కడా కూడా వ్యక్తిగత ధూషణలు చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి చేస్తున్న రాజకీయాలు, ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్న తీరు, రాజకీయాల్లో వారు ప్రోత్సహిస్తున్న విధ్వంసకర విధానాలు చూస్తుంటే బాధగా ఉందన్నారు.

హసీనాపై విచారణ ప్రారంభం

ఢాకా : 2024లో విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ఆందోళనలను హింసాత్మకంగా అణిచివేశారనే ఆరోపణలపై దేశ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాపై బంగ్లాదేశ్ అంతర్జాతీయం నేరాల ట్రిబ్యునల్ ఆదివారం విచారణను ప్రారంభించింది. ఈ ట్రిబ్యునల్‌కు చీఫ్ ప్రాసిక్యూటర్‌గా తాజుల్ ఇస్లాంను తాత్కాలిక ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఇస్లాం తన ప్రారంభ ప్రకటనలో 'అన్ని నేరాలకు కేంద్రం'గా హసీనాను విమర్శించారు. హసీనాకు తీవ్రమైన శిక్ష విధించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ కేసులో హసీనా ముఖ్య సహాయకులు మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్, మాజీ పోలీస్ ఐజి అబ్దుల్లా అల్ మామున్‌లను కూడా ప్రాసిక్యూషన్ సహ నిందితులుగా పేర్కొంది.

జీవన సౌరభం

పైవారితో గౌరవంగా సాటివారితో స్నేహంగా మెలగడం కాదు.. తనకన్నా చిన్నవారితో మెలిగే తీరే వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.

మీ కోసం

గోరువెచ్చని నీటిలో ఓ పది నిమిషాలు చమ్కీ గాజులను ఉంచి, వేసుకుంటే చమ్కీలు అతుక్కోవు.



అందమైన లోకం



తేనెటీగ

తేనే టీగల గుంపు
జుమ్మంటూ వచ్చింది
పెద్ద చెట్టుని చూసి
చుట్టూ తిరిగింది.

గట్టి కొమ్మను ఎంచి
మొదలు పెట్టేసింది.
తెచ్చినా మైనంతో
పట్టు కట్టేసింది.

పూలపై వాలాయి
తేనె టీగల్లు
ఒడుపుగా పీల్చాయి
తియ్యని తేనియలు.

పట్టు గదులలోన
దాచాయి తేనె
ఎవరిని రానీక
కాసాయి కాపు.

కాకమ్మ

ఎండు పుల్లలు తెచ్చే
నల్లని కాకమ్మ.
చెట్టుపై గుబురున్న
కొమ్మను చూసింది.

పుల్లపై పుల్లను
నేర్పుగా పేర్చింది
ఓర్పుతో కట్టింది
కాకమ్మ గూడు.

గూటిలో నిండుగా
గుడ్లు పెట్టింది
పుట్టే పిల్లలను
తలచి మురిసింది.

రోజులు గడిచాయి.
గుడ్లు పగిలాయి
బుల్లి కాకమ్మలు
కేర్ మన్నాయి.

నల్ల కాకికి
ఎర్రని పిల్లలు
కావు .. కావు .. మంటూ
కాకమ్మ నవ్వులు.

తేనె పిట్ట (గిజిగాడు)

గిర్రునా ఎగిరొచ్చే
చిట్టి తేనే పిట్ట
తుమ్మ చెట్టు కొమ్మ
పట్టుకుని లాగింది.

బరువు చూసింది
చుట్టూ వెతికింది
భయం లేదిచటని
మదిని తలచింది.

ఎగిరింది ఎక్కడికో
తూనీగ లాగ
తెచ్చింది నారను
ముక్కుతో నిండుగా

కొమ్మ చివరా మొదలు
పెట్టింది చూడు
ఎవరు కట్టలేరు
గిజిగాడి గూడు

చిన్ని చిన్ని గదులు
సన్నని ద్వారం
ఆకు పచ్చని గూడు
అందాల భవనం.

ప్రకృతిలో జీవులది
ఒక్కొక్క బాణీ
కష్టపడి సాధించు
అన్నదే తమ వాణి.

- కూచిమంచి నాగేంద్ర, 91821 27880.

నేను గీసిన బొమ్మ





మిత్తన జస్వంత్,
5వ తరగతి, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, నల్ల చెరువు గ్రామం, అయినవిల్లి మండలం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వేధింపులు.. ఎదురు కేసులు ...

ఇది కథ కాదు. కల్పితం అంతకంటే కాదు.. వాస్తవం.. కళ్లముందు జరిగిన నిజం.. అయినా అది అబద్ధమని చెబుతున్నారు. సత్యాన్ని నిలువునా చంపేసిన ఓ సంఘటన ఇటీవల కాశీ మహానగరంలో చోటుచేసుకుంది. కన్వారియా యాత్ర పేరుతో కొంతమంది చేస్తున్న యాత్ర జులై 28 నాటికి కాశీ నగరానికి చేరుకుంది. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 16 ఏళ్ళ ముస్లిం బాలికని కన్వారియా బృందంలోని కొంతమంది వ్యక్తులు వేధించి, వెంటాడారు. భయంతో ఆ బాలిక పరుగులు పెట్టిన దృశ్యాలు సిసిటీవీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. వాస్తవం ఇలా వుంది. అయితే విచిత్రంగా బాధిత బాలిక కుటుంబ సభ్యులు, బాలికకి మద్దతుగా నిలబడిన స్థానికులపై కేసులు పెట్టి అరెస్టు చేశారు. బాలిక చెప్పిందంతా అబద్ధమని, వారిపై పలు క్రిమినల్ చట్టాలు మోపారు. బాధితురాలు నేరస్తురాలిగా, నేరస్తులు బాధితులుగా మారిపోయేలా చేసిన పరిస్థితులు, మద్దతుగా నిలబడిన వారిని భయభ్రాంతులకు గురిచేసేలా అధికారులు తీసుకున్న చర్యలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి.



కాశీ రాజతలాబ్‌లో జరిగిన ఈ ఘటన గురించి బాలిక కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ రోజు తను అమ్మమ్మతో కలిసి రాణి బజార్‌లోని సోదరుడి పాదరక్షల దుకాణానికి వెళ్లింది. అప్పుడు అటువైపుగా కన్వారియాలు వెళుతున్నారు. ఉన్నట్లుండి ఇద్దరు ముగ్గురు కన్వారియాలు దుకాణంలోకి జొరబడి బాలికని దూషించడం మొదలుపెట్టారు. అతి జుగుప్సాకరంగా, అసభ్యకర పదాలను ఉపయోగించారు. ఊహించని ఈ పరిణామానికి బాలిక షాక్ అయ్యింది. ఈ లోపు కొంతమంది బాలికని పట్టుకోవడానికి ప్రయత్నించారు. తను ప్రతిఘటించడంతో మరింత దూకుడుగా మీదికి వచ్చారు. ఈ పరిస్థితుల్లో ఎటూపాలుపోని ఆ బాలిక అక్కడి నుండి పారిపోయింది. తన వెనుకే పొడవైన కర్రలు ఎత్తిపట్టుకుని కన్వారియాలు పరుగులు పెట్టారు. ఇదంతా సీసీటీవీలో రికార్డు అయ్యింది. ఆ



కన్వారియాలు బాలికను అక్కడితో వదలలేదు. తనని ఇంటివరకు వెంబడించారు. ఇంట్లోకి కూడా ప్రవేశించారు.

సాక్షులపై కేసులు..

కర్రలతో తరుముతూ వస్తున్న వ్యక్తుల నుండి తనని తాను కాపాడుకోవడానికి పరుగులు పెట్టిన బాలిక దారి గుండా పడుతూ లేస్తూ వచ్చింది. కాళ్లకి, చేతులకి గాయాలతో ఒంటిపై రక్తం మరకలు ఉన్నాయి. ఇదంతా చూస్తున్న స్థానికులు ఇంట్లోకి చొరబడిన కన్వారియాలను బయటికి లాగారు. ఈ మొత్తం సంఘటనలో వారే ప్రత్యక్ష సాక్షులు. కానీ ఇప్పుడు వారిపై కూడా కన్వారియాలపై దాడిచేశారన్న కేసు నమోదుచేశారు. ఈ ఘటన అంతా ఒక ఎత్తయితే దీని తర్వాత జరిగిన సంఘటనలు మరొక ఎత్తు.

నిందితులకి అండగా..

వేధింపులకు పాల్పడిన కన్వారియాలని సమర్థించేందుకు స్థానిక హిందూ సంస్థలు ఏకమయ్యాయి. విశ్వహిందూ పరిషత్ కార్యకర్త రాకేష్ పాండే ఆధ్వర్యంలో మార్కెట్ నుండి కిలోమీటరు మేర ట్రాఫిక్‌ని స్తంభింపజేసి మరీ ఆందోళనకి దిగారు. రాడ్లు, కర్రలు పట్టుకుని 'జై శ్రీరామ్' నినాదాలు చేశారని స్థానికులు చెబుతున్నారు.

సమయం రాత్రి 7 గంటలు..

పాండేని పోలీసులు స్టేషనుకి తీసుకెళ్లారు. ఆ తరువాత జరిగిన సంఘటనలను బాలిక కుటుంబ సభ్యులు ఇలా వివరించారు. 'పాండేని స్టేషనుకి తీసుకెళ్లిన కొన్ని గంటలకి పోలీసులు మా ఇంటికి వచ్చారు. ఎందుకు? ఏమిటి? అన్న ప్రశ్నలకు తావు లేకుండా పురుషులందరినీ పోలీసు జీపులో ఎక్కించారు. గుండెజబ్బుతో బాధపడుతున్న వ్యక్తిని కూడా వదల్లేదు.

జులై 29..

కన్వారియాలని అడ్డుకున్నారన్న నేరంతో బాలిక కుటుంబ సభ్యులతో సహా 7 గురు స్థానిక ముస్లింలపై భారతీయ న్యాయసంహితలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు పెట్టారు. 191 (2) (అల్లర్లు), 115(2) (స్వచ్ఛందంగా గాయపరిచే నేరానికి సంబంధించినది), 181 (1) (స్వచ్ఛందంగా ప్రమాదకరమైన ఆయుధాలు లేదా మార్గాల ద్వారా గాయపరచడం లేదా తీవ్రమైన గాయపరచడం), 309 (నేరం చేసే సమయంలో హింస లేదా హింస బెదిరింపును ఉపయోగించడం), 333 (హాని, దాడి లేదా తప్పుడు నిర్బంధానికి సిద్ధమైన తర్వాత ఇంట్లోకి చొరబడటం అనే నేరాన్ని సూచిస్తుంది), 351(2) దాడి, క్రిమినల్ బెదిరింపు, 352 (శాంతిని ఉల్లంఘించే ఉద్దేశ్యంతో ఉద్దేశపూర్వకంగా అవమానించడం) వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఈ కేసులే కాదు, ఉత్తరప్రదేశ్ చట్టవిరుద్ధ మత మార్పిడి నిషేధ చట్టం 2021ని కూడా నేరాల జాబితాలో చేర్చారు. అసలు ఈ మొత్తం సంఘటనలో ఈ కేసుని జొప్పించడానికి వారు చూపిన కారణం తెలిస్తే ఆశ్చర్యపోతాం. 'బాలికని రక్షించేందుకు కన్వారియాలతో పాటు ఆ ఇంట్లోకి వెళ్లిన ముస్లిం వ్యక్తులు బలవంతంగా కన్వారియాలను ఇస్లాం మతంలోకి మార్చడానికి ప్రయత్నించడాన్ని సూచిస్తుంద'ని చెప్పారు. అంతేకాదు, బాలిక కుటుంబం నిర్వహించే పాదరక్షల దుకాణం ఉన్న సందులో బుల్డోజర్లు కూడా నిలిపివుంచారు. 'ఇదంతా స్వయంగా అధికారులు మమ్మల్ని బెదిరించేందుకు చేసిన ప్రయత్నాల'ని స్థానికులు చెబుతున్నారు.

అండగా ఉన్న హిందూ కుటుంబంపై కూడా..

ఈ ఘటన జరుగుతున్నప్పుడు బాలిక వెంట కన్వారియాలు కర్రలతో వెంటపడ్డారన్న నిజాన్ని చెబుతున్న హిందూ వ్యక్తులని 'నిశ్శబ్దంగా ఉండమ'ని కన్వారియాలు బెదిరించారని బాలిక కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

మొత్తం సంఘటనలో కన్వారియాలపై ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు అవ్వలేదు. దీంతో తమకి న్యాయం చేయమంటూ బాధిత కుటుంబం ఆన్‌లైన్లో మానవ హక్కుల కమిషన్‌కి ఫిర్యాదు చేసింది.

పోలీసుల వేధింపులు..

కేసులు పెట్టిన కుటుంబాలనే కాదు, స్థానిక ముస్లిం కుటుంబాలని కూడా పోలీసులు బెదిరిస్తున్నారు. 'ఆ వీధిలోని స్థానిక ముస్లిం దుకాణాదారులను ప్రతి రోజూ స్టేషనుకి వచ్చి రిపోర్టు చేయమని, లేకపోతే షాపులు కూల్చి వేస్తామని ఫోను చేస్తున్నట్లు' షాపు యజమానులు చెబుతున్నారు.

సిసీటీవీ ఫుటేజ్.. 100 శాతం తప్పంట..

సిసీటివిలో చాలా స్పష్టంగా ఆ రోజు కన్వారియాలు బాలికని వేధించిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయినా 'బాలిక కుటుంబం చేసిన ఆరోపణలు, వాదనలు 100 శాతం తప్పు' అని రాజతలాబ్ ఎసిపి అంటున్నారు. పైగా సంఘటన జరిగిన మూడు రోజుల తరువాత రాజతలాబ్ రాపిడ్‌యాక్షన్ ఫోర్స్, స్థానిక పోలీసులు కన్వారియాలకు రక్షణగా వాళ్లతో కలిసి తిరిగారు. హిందూ సంస్థలు కూడా నినాదాలు చేస్తూ ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారని స్థానికులు వాపోతున్నారు.

జోరుగా పండగ సినిమాల షూటింగులు

తెలుగు చిత్ర పరిశ్రమకు కేరాఫ్‌గా చెప్పబడే హైదరాబాద్‌లో నటీనటులతో పాటు సాంకేతిక నిపుణులు నివాసం ఉంటుంటారు. (ఇతర భాషల వాళ్లు కూడా కొంతమంది). విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఇటీవల షూటింగ్‌లు కొనసాగుతున్నాయి. సినిమా షూటింగ్‌లకు అనువైన స్టూడియోలు హైదరాబాద్‌తో పాటుగా దాని పరిసర ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకమైన సెట్టింగులు వేసి నిర్మాతలు చిత్రీకరణలు జరుపుతుంటారు. రాబోయేకాలంలో వినాయక చవితి, దసరా, దీపావళి, క్రిస్మస్ వంటి పండుగలు ఉన్నాయి. ఆయా సినిమాల విడుదలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఎక్కువగా హైదరాబాద్‌లోనూ, దాని పరిసర ప్రాంతాల్లోనూ సినిమా షూటింగ్‌లు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్, పవన్ కల్యాణ్, నాగచైతన్య, రామ్ పోతినేని, విజయ్



సేతుపతి, సాయిదుర్గా తేజ్, తేజా సజ్జా, అఖిల్ అక్కినేని, సిద్ధు జొన్నలగడ్డ వంటి పలువురు కథానాయకుల సినిమాల షూటింగ్‌లు గత కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్నాయి.

యాక్షన్ సన్నివేశాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్'

హరిహర వీరమల్లు సినిమా తర్వాత పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. 'గబ్బర్‌సింగ్' (2012) తర్వాత ఈ హిట్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రమిదే. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. పవన్‌కళ్యాణ్ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. క్లైమాక్స్‌లో భాగంగా కీలక సన్నివేనబకాంత మాస్టర్ పర్యవేక్షణలో అల్యూమినియం ఫ్యాక్టరీలో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో 'డ్రాగన్'

'దేవర' వంటి హిట్ సినిమా తర్వాత ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' చిత్రాల ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. గుల్షన్‌కుమార్, భూషణ్‌కుమార్; టి. సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్ కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగు తోంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 25న విడుదలకానుంది.

పీపుల్స్ మీడియా స్టూడియోలో 'రాజా సాబ్'

'బాహుబలి' సినిమా తర్వాత ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధి అగర్వాల్ కథానాయికలు. టిజి విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్ సమీపంలోని అజీజ్ నగర్‌లో పీపుల్స్ మీడియా స్టూడియోలో జరుగుతోంది. ప్రభాస్‌తో పాటు ఇతర తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను దర్శకుడు మారుతి చిత్రీకరిస్తున్నారు. చిత్రంలో ప్రభాస్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ తాత పాత్ర పోషిస్తున్నారు. కీలక సన్నివేశాలు మినహా దాదాపుగా సినిమా షూటింగ్‌ను మారుతి పూర్తిచేశారు. డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది.

శంకరపల్లిలో పెద్ది

రామ్‌చరణ్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'పెద్ది'. తొలి సినిమా 'ఉప్పెన'తో(2021) బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సానా 'పెద్ది'కి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్ సమీపంలోని శంకరపల్లిలో జరుగుతోంది. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎఆర్ రెహమాన్ సంగీతం.

అన్నపూర్ణ స్టూడియోలో 'ఎన్‌సి 24 '

'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్‌ను అందుకున్న నాగచైతన్య తాజా చిత్రం 'ఎన్‌సి 24' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తున్నారు. 'విరూపాక్ష' (2023) దర్శకుడు కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. బాపినీడు సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో ఈ షూటింగ్ జరుగుతోంది.



ముచ్చింతల్‌లో 'ఆంధ్ర కింగ్'

రామ్ పోతినేని కథానాయకుడిగా తెరకెక్కుతున్న సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' మూవీ ఫేమ్ పి.మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ కథానాయకుడు ఉపేంద్ర, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో జరుగుతోంది.

మరికొన్ని చిత్రాల షూటింగ్ షురూ...

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లెనిన్' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లోని ఓ పాతభవనంలో జరుగుతోంది. సాయిదుర్గా తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల యేటిగట్టు). రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి కథానాయిక.



తుక్కుగూడలో షూటింగ్ కొనసాగుతోంది. తేజా సజ్జా నటిస్తున్న 'మిరాయ్' చిత్రం ఆర్ఎఫ్‌సిలో జరుగుతోంది. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి కథానాయికలు. శంకరపల్లిలో షూటింగ్ జరుగుతోంది.

'ఫలితం' నేటికి వాయిదా

- రసవత్తరంగా ఐదో టెస్టు
- విజయానికి నాలుగు వికెట్ల దూరంలో టీమిండియా
- నాలుగో రోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 339/6
- శతకాలతో చేలరేగిన బ్రూక్, రూట్



ఓవల్ : సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదో టెస్టు అంచనాలకు మించి సాగుతోంది. నాలుగో రోజు ఆటలోనే ఫలితం తేలిపోతుందనుకున్న ఈ మ్యాచ్ రసవత్తరంగా మారింది. విజయం సాధించడం కోసం చివరి రోజైన సోమవారం ఆటలో భారత్ నాలుగు వికెట్లు, ఇంగ్లండ్ 35 పరుగులు సాధించాల్సిన పరిస్థితిలో నిలిచాయి. ఈ టెస్టులో ఇంగ్లండ్‌కు భారత్ 374 పరుగులు విజయలక్ష్యాన్ని నిర్దేశించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం ముందుగా వికెట్ నష్టానికి 50 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఇంగ్లండ్ బ్యాటర్లు నిదానంగా ఆటను కొనసాగించారు. బెన్ డక్కెట్ (54 పరుగులు) జట్టు స్కోరు 82 పరుగుల వద్ద రెండో వికెట్‌గా అవుటయ్యాడు. కెప్టెన్ ఓలీపోప్ (27) కూడా త్వరగానే పెవిలియన్ చేరుకున్నాడు. అయితే ఈ దశలో హెర్రీ బ్రూక్ (111 పరుగులు, 98 బంతుల్లో రెండు సిక్స్‌లు, 14 ఫోర్లు)- జో రూట్ (105, 152 బంతుల్లో 12 ఫోర్లు) జోడీ భారత బౌలర్లను ధాటిగా ఎదుర్కొని పరుగులు సాధించింది. ఈ జోడీ ఉన్నంత సేపు ఇంగ్లండ్ విజయం ఖాయంగా కనిపించింది. జోడీ నాలుగో వికెట్‌కు 195 పరుగులు జోడించింది. అయితే జట్టు స్కోరు 301 వద్ద బ్రూక్‌ను అకాష్ దీప్ అవుట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. ఈ తరువాత వచ్చిన జకోబ్ బెథల్ (5)ను ప్రసీథ్ కృష్ణ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ మంత చిక్కుల్లో పడింది. ఈ తరువాత సెంచరీ పూర్తి చేసుకున్న రూట్‌ను కూడా ప్రసీథ్ కృష్ణ వెనక్కి పంపాడు. దీంతో 337 పరుగులకు ఇంగ్లండ్ ఆరు వికెట్లను కోల్పోంది. ఈ తరువాత

వెలుతురు మందగించడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. ఈ తరువాత వర్షం కూడా కురవడంతో నాలుగో రోజు ఆటను త్వరగా ముగించారు. ఆదివారం ఆట ముగిసేసరికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. స్మిత్ (2), ఓవర్ టన్ (0) క్రీజ్‌లో ఉన్నారు. భారత జట్టులో ప్రసీద్ కృష్ణ మూడు వికెట్లు, సిరాజ్ రెండు వికెట్లు సాధించారు. అకాశ్ ఒక్క వికెట్ సాధించారు.

ల్యాండో నోరిస్ రయ్‌రయ్

- టాప్‌లేపిన మెక్‌లారెన్ డ్రైవర్
- హంగేరియన్ గ్రాండ్‌ప్రీ 2025

బుడాపెస్ట్ (హంగరీ) : ఫార్ములా వన్ (ఎఫ్1) రేసింగ్‌లో ఈ ఏడాది మెక్‌లారెన్‌కు ఎదురు లేదు. సీజన్ ఆరంభం నుంచి వరుస గ్రాండ్‌ప్రీలను కైవసం చేసుకుంటున్న మెక్‌లారెన్.. తాజాగా హంగేరియన్ గ్రాండ్‌ప్రీని సైతం సొంతం చేసుకుంది. ల్యాండో నోరిస్, ఆస్కార్ పియాస్ట్రి నువ్వా నేనా అంటూ ప్రతి రేసులోనూ రయ్‌రయ్‌మని దూసుకెళ్తున్నారు. ఆదివారం ముగిసిన హంగేరియన్ గ్రాండ్‌ప్రీలో ల్యాండో నోరిస్ విజేతగా నిలిచాడు. 70 ల్యాప్‌ల బుడాపెస్ట్ రేసింగ్ సర్క్యూట్‌లో ల్యాండో నోరిస్ అదరగొట్టాడు. 1.35.21.231 సెకండ్లలో రేసును ముగించి పోడియం ఫినిష్ చేశాడు. మెక్‌లారెన్ మరో డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి సహచర డ్రైవర్ నోరిస్ కంటే 0.698 సెకండ్ల వెనుకంజలో నిలిచి రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జార్జ్ రసెల్ (మెర్సిడెస్), చార్లెస్ లాక్రెక్ (ఫెరారి), ఫెర్నాండో అలోన్సో (ఆష్టన్ మార్టిన్) టాప్-5లో నిలిచారు.

మెక్‌లారెన్.. 200 : ఎఫ్1 రేసింగ్ జట్టు మెక్‌లారెన్ అరుదైన మైలురాయి అందుకుంది. ఎఫ్1 రేసింగ్ చరిత్రలో ఆ జట్టు 200వ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఈ సీజన్‌లో ఆస్కార్ పియాస్ట్రి, ల్యాండో నోరిస్‌లు పోటీపడుతూ విజయాలు సాధించటం మెక్‌లారెన్‌కు గొప్పగా కలిసొచ్చింది. కన్‌స్ట్రక్టర్ల చాంపియన్‌షిప్స్ (టీమ్ చాంపియన్‌షిప్) మెక్‌లారెన్ ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో నిలిచింది. మెక్‌లారెన్ (559) అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. మెర్సిడెస్ (260) రెండో స్థానంలో నిలిచింది. రెడ్‌బుల్ (194), విలియమ్స్ (70), ఆష్టన్ మార్టిన్ (52), సుబేర్ (51), రేసింగ్ బుల్స్ (45), హాస్ (35), ఆల్పైన్ (20) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సీజన్ ఓవరాల్ డ్రైవర్ చాంపియన్‌షిప్‌లో మెక్‌లారెన్ డ్రైవర్లు టాప్-2లో కొనసాగుతున్నారు. ఆస్కార్ పియాస్ట్రి (284) నం.1గా కొనసాగుతుండగా.. ల్యాండో నోరిస్ (275) ద్వితీయ స్థానంలో నిలిచాడు. మాక్స్‌వెర్‌స్టాపెన్ (187), జార్జ్ రసెల్ (172), చార్లెస్ (151), లూయిస్ హామిల్టన్ (109)లు టాప్-6లో కొనసాగుతున్నారు.



మహిళల 4 X100 మీటర్ల రిలేలో అమెరికా ప్రపంచ రికార్డు

సింగపూర్ : మహిళల 4x100 మీటర్ల మెడ్లీ రిలేలో అమెరికా తన ప్రపంచ రికార్డును తనే తిరగరాసింది. సింగ్‌పూర్‌లో ఆదివారం జరిగిన మహిళల 4x100 మీటర్ల మెడ్లీ రిలే వరల్డ్ టైటిల్‌ను అమెరికా 3 నిమిషాల 49.34 సెకన్ల వ్యవధిలో గెలుచుకుని కొత్త రికార్డును సృష్టించింది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో నమోదు చేసిన 3:49.63 రికార్డును అధిగమించింది. ఆదివారం పోటీల్లో ఆస్ట్రేలియా జట్టు 3:52.67తో పరుగును ముగించి రెండో స్థానంలో నిలిచింది. చైనా జట్టు 3:54.77 తో ముగించి మూడో స్థానం సొంతం చేసుకుంది. నూతన ప్రపంచ రికార్డు నెలకొల్పిన అమెరికా జట్టులోని రెగాన్ స్మిత్, కటే డగ్లస్, గ్రెట్చెన్ వ్లాష్, టొర్రి హుస్కే సంతోషం వ్యక్తం చేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68